ప్రజాశక్తి
సోమవారం 3 జులై 2023
8 పేజీలు





విశాఖపట్నం అనకాపల్లి

భూమి పోయే.. స్థలమూ రాకపాయే..!

- భూ సమీకరణలో పంట పొలాలు పోగొట్టుకున్న పేదలకు అవస్థలు
- స్థలాలు ఎప్పుడు, ఎక్కడ ఇస్తారో తెలీని పరిస్థితి
- కోర్టును ఆశ్రయిస్తున్న పేద రైతులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, పరవాడ విలేకరి



మా నాన్న నానేపల్లి రమణకు పరవాడ మండలం దేశపాత్రుని పాలెం రెవెన్యూ గ్రామ సర్వే నెంబర్ 303/3లో 3.83 సెంట్లలో డి పట్టా 1970లో ఇచ్చారు. ఇళ్ల స్థలాల కోసం భూమి తీసుకున్నప్పుడు లే అవుట్‌లో ఎకరానికి 900 గజాల స్థలమిస్తామన్నారు. ఏళ్లవుతున్నా ఇంతవరకూ స్థలమివ్వలేదు. ఈ భూమిలో సరుగుడు వేశాం. నాలుగైదేళ్లకు ఒకసారి అమ్ముకుంటే రూ.1.80 లక్షలు వచ్చేది. కోతకొచ్చిన సరుగుడు అమ్ముకోవడానికి గడువు ఇవ్వకుండా తోటంతా కొట్టేసి భూమి తీసుకున్నారు. భూమి తీసుకున్నట్లు స్లిప్ కూడా ఇవ్వలేదు. ఇప్పుడు స్థలమెప్పుడు ఇస్తారో, ఎక్కడ ఇస్తారో చెప్పడంలేదు

- లక్కరాజు వరలక్ష్మి, జాజులవానిపాలెం, పరవాడ మండలం



50 ఏళ్ల క్రితం నుంచి దేశపాత్రునిపాలెం సర్వే నెంబరు 312లో మూడెకరాల ప్రభుత్వ భూమి సాగుచేస్తున్నాను. ఈ భూమిలో సరుగుడు, జీడితోట వేశాను. ఏడాదికి పంట రూ.15 నుంచి 20 వేలు వచ్చేది. భూమిలో నిలబెట్టి ఫొటో తీసుకున్నారుగానీ, ఎంత భూమి ఇస్తారో చెప్పలేదు.

- జాజుల క్రిష్ణారావు, జాజులవానిపాలెం

పెదముషిడివాడ



సర్వే నెంబరు 63/48లో మా ఆయన పల్లా అచ్చిబాబు పేర 1.83 సెంట్లులో డి పట్టా వుంది. ఇదే సర్వే నెంబర్‌లోని 2.83 సెంట్లలో 40 ఏళ్ల నుంచి జీడి, మామిటి తోటలు పెంచుకున్నాం. 367 సర్వే నెంబర్‌లో 1.55 సెంట్లులో జీడి మామిడి తోట వేశాం. ప్రతిఏటా ఎకరాకు రూ.20 వేలు పంట వచ్చేది. ఇళ్ల పట్టాల కోసం భూమి తీసుకోవడంతో పంట ఫలసాయం రాలేదు. 367 సర్వే నెంబర్‌లోని భూమిలో ఇళ్లుకట్టుకుందామని లక్ష రూపాయలు ఖర్చుచేసి వేసిన పునాదులు తొలగించారు. డి పట్టా భూమికి ఎకరాకు 900 గజాలు, పట్టాలేని సాగుభూమికి ఎకరాకు 450 గజాలు చొప్పున ఇస్తామన్న స్థలమివ్వలేదు.

పల్లా రాములమ్మ, పెదముషిడివాడ, పరవాడ మండలం



దేశపాత్రునిపాలెంలో వేసిన లే అవుట్

వీళ్లే కాదు. నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు పథకానికి ల్యాండ్ పూలింగ్‌లో భూములిచ్చిన వారంతా ఇలానే ఆందోళన చెందుతున్నారు. భూమి పోయే.. స్థలమూ రాకపాయే.. అని వాపోతున్నారు. విషయంలోకి వెళ్తే..

నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఇళ్ల స్థలాల కోసం పేదల సాగులోని భూముల మిగతా 2లో..



లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడుతున్న సింహగిరి

ఘనంగా గిరి ప్రదక్షిణ

లక్షలాదిగా తరలివచ్చిన భక్తజనం

సింహాచలం లక్ష్మీ నృసింహ స్వామి గిరి ప్రదక్షిణకు ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే దూర ప్రాంతాల నుంచి లక్షల మంది తరలివచ్చారు. అధికారికంగా మధ్యాహ్నం 2 గంటలకు స్వామి రథంతో గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. సుమారు 32 కిలోమీటర్ల మేర సాగే ఈ ప్రదక్షిణకు వచ్చే భక్తులకు అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లిఖార్జున అప్పుఘర్ వద్ద భక్తులకు కల్పించిన ఏర్పాట్లును, మెడికల్ క్యాంపులను జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మతో కలిసి పరిశీలించారు. మరోవైపు భక్తుల కోసం స్వచ్ఛంద సంస్థలు పలు సౌకర్యాలు కల్పించాయి. (వార్త 4లో..)

జిఓ 117 రద్దుకు పోరాటం

వార్త 2లో..

ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

వార్త 2లో..

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాలి

వార్త 2లో..



ఎంవిపి రైతు బజారులో టమాటా కోసం బారులుతీరిన వినియోగదారులు

సబ్సిడీ టమాటా అమ్మకాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ప్రభుత్వం కిలో రూ.50తో ప్రవేశపెట్టిన సబ్సిడీ టమాటా అమ్మకాల కౌంటర్లను విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ కె.విశ్వనాథన్ ఆదివారం ఉదయం ఎంవిపి రైతు బజారులో ప్రాంభించారు. ఈ రైతు బజారులో మొత్తం నాలుగు కౌంటర్ల ద్వారా అమ్మకాలు చేపట్టారు. ఆధార్ కార్డు చూపిన తరువాత ఒక వినియోగదారునికి ఒక కిలో మాత్రమే టమాటా అందజేస్తూ విక్రయాలు నిర్వహించారు. సబ్సిడీ టమాటా కౌంటర్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రైతు బజారు ఇఒ ప్రసాద్ తెలిపారు. మరోపక్క సబ్సిడీ టమాటా కోసం జనం బారులుతీరారు.

ఇళ్ల నిర్మాణాల్లో నిరంతర ప్రగతి

- మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యం
- 'ప్రజాశక్తి'తో హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఇళ్ల నిర్మాణాల్లో నిరంతర ప్రగతి సాధించే దిశగా హౌసింగ్ సిబ్బంది, లే అవుట్ల ప్రత్యేక అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లతో సమీక్షలు నిర్వహిస్తూ.. జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నామని విశాఖ జిల్లా గృహనిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పి.శ్రీనివాసరావు అన్నారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి కొన్ని లే అవుట్లను, 2024 మార్చి నాటికి మొత్తం విశాఖ జిల్లాలో 96,250 ఇళ్లను పూర్తి చేసే దిశగా కార్యాచరణ రూపొందించామని తెలిపారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో జిల్లాలో చేపడుతున్న జగనన్న లే అవుట్ల అభివృద్ధిపై పలు అంశాలను ఆయన తెలియజేశారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఇళ్ల నిర్మాణాలకు ఏమైనా కొరత ఉందా?

విశాఖ జిల్లాలో 67 లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు నడుస్తున్నాయి. మెషినరీ, లేబర్, ఇసుక, స్టీల్, వగైరా సామగ్రి అంతటినీ సమీకరించుకుంటున్నాం. సిబ్బందితో నిరంతర ప్రగతి సమీక్షలు



నిర్వహిస్తున్నాం. 67 లే అవుట్లలో లేబర్ 5600 మంది పనిచేస్తున్నారు. మరో 3 వేల మంది వరకూ అవసరం కాగా జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాం. అలాగే బ్రిక్ ఇండస్ట్రీలు ప్రభుత్వానివి విశాఖ జిల్లాలో 12 ఉన్నాయి. ఉత్పత్తిని పెంచాలని ప్రతిపాదన చేశాం.

మౌలిక వసతులు ఎలా కల్పిస్తున్నారు ?

ఇప్పటికే మౌలిక వసతులు (వీధి లైట్లు, రోడ్లు, మంచినీరు) కల్పన కోసం విఎంఆర్‌డిఎ రూ.150 కోట్లు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

భూమి పోయే.. స్థలమూ రాకపాయే..!

సమీకరణకు 2020 జనవరి 20న జిఒ 72ను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ భూములను లే అవుట్‌ల కింద అభివృద్ధిచేసే బాధ్యత విఎంఆర్‌డిఎకి అప్పగించింది. విశాఖ రూరల్, గాజువాక, పెదగంట్యాడ, పెందుర్తి, భీమిలి, పరవాడ, అనకాపల్లి, పద్మనాభం, ఆనందపురం, సబ్బవరం మండలాల్లోని 55 గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ (భూ సమీకరణ) కింద 6116.50 ఎకరాలు సమీకరించాలని జిఒలో పేర్కొంది. డి పట్టా రైతులకు ఎకరాకు 900 గజాలు, ప్రభుత్వ భూమిలో 10 ఏళ్లకు పైబడి సాగుచేస్తున్న రైతులకు ఎకరాకు 450 గజాలు, ఐదు నుంచి పదేళ్ల మధ్య సాగుచేసే రైతులకు 250 గజాలు చొప్పున అభివృద్ధి చేసిన లే అవుట్లలో స్థలమివ్వనున్నట్లు జిఒలో తెలిపింది. భూములివ్వడానికి అంగీకారం తెలిపిన వరకు ప్రభుత్వ యంత్రాంగం పేదలను నమ్మించింది. భూములిచ్చిన తరువాత అత్యధిక మంది పేదలు వరలక్ష్మి, క్రిష్ణారావు, రాములమ్మ వలే బాధపడుతున్నారు. అటు పంట పొలాల్లేక, ఇటు లే అవుట్లలో స్థలాలివ్వకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. దేశపాత్రునిపాలెంలో సమీకరించిన 63.63 ఎకరాల్లో 41 మందికి స్థలాలు కేటాయించినట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నా, వాస్తవానికి అభివృద్ధి చేసిన లే అవుట్లలో స్థలం అప్పగించలేదు. పెదముషిడివాడ రెవెన్యూ గ్రామంలో సమీకరించిన 161 ఎకరాలకు సంబంధించిన 142 మంది రైతులకు స్థలాలు ఇవ్వలేదు. జిఒలో పేర్కొన్నట్లు పట్టా భూములు, సాగు భూములకు ఇస్తామన్న స్థలం ఎప్పుడు, ఎక్కడ ఇస్తారో రెవెన్యూ అధికారులు చెప్పడంలేదు. పూర్తిస్థాయిలో లే అవుట్లు అభివృద్ధి చేశాక స్థలాలు అప్పగిస్తామని రెవెన్యూ అధికారులంటుంటే, లే అవుట్లు పని పూర్తయిందని స్థలాలు అప్పగించే బాధ్యత రెవెన్యూ అధికారులదేనని విఎంఆర్‌డిఎ అధికారులు చెబుతున్నారు. చివరకు భూములు కోల్పోయిన పేద రైతుకు అభివృద్ధి చేసిన లే అవుట్లలో స్థలాలివ్వకుండా, ఎక్కడ, ఎప్పుడు ఇస్తామో చెప్పకుండా ప్రభుత్వ యంత్రాంగం దాటవేయడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. గడువు ప్రకారం స్థలాలు అప్పగించకపోవడంతో కొంతమంది పేద రైతులు అనివార్య పరిస్థితుల్లో కోర్టును ఆశ్రయిస్తున్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో నిరంతర ప్రగతి

ఖర్చు చేసింది. ఆనందపురం మండలం గిడిజాలలో ప్రాజెక్టు -2లో 890 ఇళ్లు, గిడిజాల -3లో 1300 ఇళ్లు ఈ అక్టోబర్ నాటికి పూర్తి కానున్నాయి. ఇక్కడ రూ.14.13 కోట్లు ఖర్చవుతుందని ప్రతిపాదన చేశాం. మౌలిక వసతులు, పనుల వేగవంతానికి ప్రతి లే అవుట్‌కూ ఒక స్పెషలాఫీసర్ ఉన్నారు. ప్రతి వెయ్యి ఇళ్లకు సచివాలయ సిబ్బంది ఒకరిని ఆన్‌లైన్ పేమెంట్ల ప్రోసెస్ కోసం ఏర్పాటు చేశాం.

రైతుల వద్ద తీసుకున్న భూమికి ప్రతిఫలం ఏమిస్తున్నారు ?

జిల్లాలో 67 జగనన్న లే అవుట్లు కేవలం కాలనీల కోసం ఉండగా అదనంగా మరో 6 లే అవుట్లను హౌసింగ్ డిపార్టుమెంట్ అభివృద్ధి చేస్తోంది. ఎక్కడెక్కడ రైతుల నుంచి ల్యాండ్‌పూలింగ్‌లో భూములను తీసుకున్నామో అక్కడ వారికి డవలప్ చేసిన హౌస్ సైట్లను అందజేస్తున్నాం. ప్రభుత్వ నిబంధనానుసారం వీటిని రైతులకు కేటాయించాం.



దీక్షల్లో కూర్చున్న నాయకులు

ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుని తీరుతామని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష, కార్యదర్శులు జి శ్రీనివాసరావు, నమ్మి రమణ అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 822వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని దించకపోతే దేశానికి భవిష్యత్తు లేదన్నారు. ఆ పార్టీ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు దాటినా ఒక్క పరిశ్రమ కూడా కొత్తగా రాలేదన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పి.మసేను, యు.సోమేష్, అంకంరెడ్డి శ్రీను, షఫీ, మౌళి, అప్పలరాజు, దేముడు పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - సీలేరు: సీలేరు పరిసర ప్రాంతాల్లో పోలీసులు ముమ్మర వాహన తనిఖీలు, గాలింపు చర్యలు చేపట్టారు. సీలేరు ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులతోపాటు సిఆర్‌పిఎఫ్ బృందాల ఆధ్వర్యంలో ఎపి జెన్‌కో చెక్‌పోస్టు, రామాలయం సెంటర్, ఐటిఐ జంక్షన్ వంటి ప్రధాన కూడళ్లతోపాటు సీలేరు ఆదివారం వారపు సంతలోనూ ముమ్మర తనిఖీలు నిర్వహించారు.

అచ్యుతాపురంలో..

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అచ్యుతాపురం సెజ్‌లోని పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారని, వీరు నిత్యం జరుగుతున్న ప్రమాదాలలో మృత్యువాత పడటం, గాయాలపాలవడం పరిపాటిగా మారిన నేపథ్యంలో అచ్యుతాపురం కేంద్రంగా వంద పడకల ఇఎస్ఐ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాలని సిఐటియు అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము డిమాండ్ చేశారు. సాహితీ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్‌లో మూడు రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కెజిహెచ్, ఇండస్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న సాదిరెడ్డి రాజబాబు, సమ్మెంగి అప్పారావు, సింగంశెట్టి నూకి నాయుడు, రామేశ్వర్, పిల్లా సంతోష్ కుమార్‌లను ఆదివారం ఆయన పరామర్శించారు. బాధిత కుటుంబాలను ఓదార్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ క్షతగాత్రుల్లో పిల్లా సంతోష్ కుమార్ తప్ప మిగతా నలుగురి పరిస్థితీ విషమంగానే ఉందన్నారు. వీరికి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఇటువంటి ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వం, అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టి కార్మికుల ప్రాణాలు కాపాడాలన్నారు. ప్రమాదకర పరిశ్రమలకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతులు రద్దు చేయాలన్నారు. మృతులకు, గాయపడ్డ వారికి ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియాను పెంచాలని డిమాండ్ చేశారు.



క్షతగాత్రున్ని పరామర్శిస్తున్న సిఐటియు నాయకులు రాము

జిఒ 117 రద్దుకు పోరాటం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జిఒ 117ను రద్దు చేసి ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించాలని, సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.భానుమూర్తి, ఎఎస్.గణపతి డిమాండ్ చేశారు. విద్య, ఉపాధ్యాయ రంగాల అపరిష్కృత సమస్యల పరిష్కారానికి ఫ్యాప్టో దశల వారీ ఉద్యమంలో భాగంగా సమాఖ్య జిల్లా సదస్సు ఎపి పెన్షనర్స్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిఒ 117తో విద్యారంగం పెను సంక్షోభంలో కూరుకుపోయిందని అన్నారు. ఈ జిఒ వల్ల వేలాది పాఠశాలల విలీనం, వేలాది ఉపాధ్యాయుల పోస్టులు రద్దు అవుతున్నాయన్నారు. వినాశకరమైన ఈ జిఒను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. పాత పిఆర్‌సి బకాయిలు చెల్లించాలని, ఆ తర్వాతే 12వ పిఆర్‌సికి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని అన్నారు. సదస్సుకు ఫ్యాప్టో జిల్లా చైర్మన్ గొండు షణ్ముఖరావు అధ్యక్షత వహించారు. రాష్ట్ర కో చైర్మన్ సిహెచ్.వెంకటేశ్వర్లు, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు గొంది చిన్నబ్బాయి, సెక్రటరీ జనరల్ వై.సుధాకర్, ఎఎస్ఆర్ జిల్లా చైర్మన్ జె.జగన్మోహన్, ఎపిటిఎఫ్ నాయకులు బి.వెంకటపతి రాజు, టి.రామకృష్ణారావు, ఎన్.సన్యాసినాయుడు, యుటిఎఫ్ నాయకులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్.అంబేద్కర్, వి.శ్రీలక్ష్మి, ఐ.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో నినదిస్తున్న ఫ్యాప్టో నాయకులు

మురుగునీటి సమస్యపై నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దక్షిణ నియోజవర్గం 35వ వార్డులో మురుగునీటి కాలువలను మెరుగుపరచాలని, యుజిడి సమస్యను పరిష్కరించాలని సిఐటియు జగదాంబ జోన్ నాయకులు ఎం.సుబ్బారావు డిమాండ్ చేశారు. ఆదివారం వార్డు పరిధిలోని ద్రోణంరాజు సత్యనారాయణ కాలనీ, ఆయిల్ మిల్ సందు మురికి నీటి కాలువ, యుజిడి సమస్యల పరిష్కారం కోసం స్థానికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానికుడు దుర్గారావుతో కలిసి మాట్లాడారు. ఎన్నోసార్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణకు, జోనల్ కమిషనర్‌కు మురుగునీటి సమస్యపై ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యా తీసుకోలేదన్నారు. మురికి కాలువల్లో పూడిక తీయకపోవడం వల్ల దోమల బెడద విపరీతంగా ఉందని, ఇప్పటికే ఒక మహిళకు ఫైలేరియా సోకిందని తెలిపారు. వ్యాధులు విజృంభించక ముందే అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీను, కె.లక్ష్మి, వరలక్ష్మి, సత్య, సత్యవతి, నారాయణ, శ్రీను, రవణమ్మ పాల్గొన్నారు.

ఆజాద్‌పై కాల్పులను ఖండిస్తూ నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : భీమ్ ఆర్మీ చీఫ్ ఆజాద్‌పై కాల్పులు జరిపిన వారిని కఠినంగా శిక్షించాలని దళిత, ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. కాల్పులను ఖండిస్తూ ఆదివారం ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహం వద్ద వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళితుల హక్కుల కోసం చంద్రశేఖర్ ఆజాద్ ఎనిమిది సంవత్సరాల నుంచి పోరాడుతూ, అన్యాయాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో అతనిపై కక్షగట్టి మతోన్మాద మూకలు కాల్పులు జరిపారని తెలిపారు. నిరసన కార్యక్రమంలో సుర్ల వెంకటరమణ, కొత్తపల్లి వెంకటరమణ, వై.సూకరాజు, రాంప్రభు పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE VII ADDL. DISTRICT AND SESSIONS JUDGE AT: VISAKHAPATNAM
E.P. 152/2018 in O.S.79/2015

Between :
Pusapati Venkatapathi Raju (Died) & others ...Decree Holders
And
Smt.Datla Rajani Devi ...Judgment Debtor

Notice under Order-21 Rule-54-(1-A) of C.P.C.

To, **Judgment Debtor :**
Smt. Datla Rajani Devi,
W/o. Sri V.V.A.N. Raju, D.No.D-4, Raj Paradise Apartment, Narasimha Nagar, Near Ryuthu Bazar, Visakhapatnam.

Take notice that the application filed by the above named decree holder to sell the property mentioned in the schedule below for the purpose of realizing sale proceeds to satisfy the decree granted in the above said suit is posted for hearing at **10:30 A.M.** on **28-07-2023** before the above said Court. By Order of the Court named above you are hereby called upon and ordered that you should attend the Court at **10:30 A.M.** on **28-07-2023** to take notice of the date to be fixed for settling the terms of proclamation of sale.

SCHEDULE OF PROPERTY

Dry land in an extent of Ac.0.83 cents in S.Nos. 9/5 to 9/10 Sowbagya Rayapuram Village, Pendurthi Mandal, Visakhapatnam District with the following boundaries: **East:** Land of Kiran Real Estates and Constructions, **South:** Land of Akkireddi Ramu Naidu and others, **West:** Land of Tedlapu Dasu, **North:** Land of Akkireddi Ramu Naidu and others.

K. PRABHAVATHI, Advocate
Visakhapatnam, Cell: 9440435309

IN THE HON'BLE COURT OF THE II ADDL. SENIOR CIVIL JUDGE AT : VISAKHAPATNAM
I.P. 9/2023

Between:
Karri Venkata Sridhar Reddy ...Petitioner
And
Palisetty Srinivasa Rao and 4 others ...Respondents

GENERAL NOTICE

The Public are hereby informed that the Petitioner filed the above I.P. against the respondents to declare him as an insolvent person and to grant him such other relief or reliefs as the Hon'ble Court may deem fit and proper; and the said I.P. stands posted to **12-07-2023.** Therefore, take notice that Persons having any objections in respect of the said I.P. are hereby called upon to appear before the above Hon'ble Court on **12-07-2023** at **10.30 a.m.** either in person or through any duly instructed advocate; failing which the above I.P. will be decided by the Hon'ble Cort in your absence.

P.V. RAJAGOPAL,
(Advocate for the Petitioner)
Visakhapatnam,
Cell: 98482 65456

మహారాజశ్రీ 2వ అడిషినల్ జిల్లా జడ్జి వారి కోర్టు, విజయవాడ, కృష్ణా జిల్లా
I.A. 41/2021 in
Unnumbered O.S. No.

Between:
1) Lingam Swathi
2) Lingam Rohan ***...Petitioners***
AND
Lingam Ravindra Babu and Others ***...Respondents***

R-4: Garapati Annapurna, W/o. Mohana Krishna, Hindu, aged 69 years, House Wife, resident of D.No. 9-30-2/1, Balaji Nagar, Siripuram, Visakhapatnam, A.P.
R-5: Lingam Sarath Babu, S/o. Bhogeswara Rao (late), Hindu, aged 58 years, Business, resident of D.No. 9-30-2/1, Balaji Nagar, Siripuram, Visakhapatnam, A.P.

పై నంబరు పిటిషన్‌లో 4వ మరియు 5వ రెస్పాండెంట్స్ అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 21-8-2023 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

పి.నందకిషోర్
రాజమండ్రి | అడ్వకేట్, రాజమండ్రి
02-7-2023 | సెల్:9848455784

కురవని వర్షం... పడని నార్లు...

ప్రజాశక్తి -భీమునిపట్నం

ఇటీవల చిరు జల్లులు తప్పితే నారు మడులు సిద్ధం చేసుకునేంత స్థాయిలో వర్షాలు కురవలేదు. వ్యవసాయ బోర్లు, మోటార్ల కింద ఉన్న పంట పొలాల్లో కొంత మంది రైతులు నారు మడులు తయారు చేసుకుంటున్నారు. జూన్ 15న ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. సెప్టెంబర్ నెల చివరి వరకూ కొనసాగుతుంది. జులై నెల వచ్చినా సరే తగిన మోతాదులో వర్షాలు కురవలేదు. ఈ పాటికే వర్షాలు కురిసి, వేసవి దుక్కులు దున్నాల్సి ఉంది.

భీమిలి డివిజన్‌లో సాధారణ విస్తీర్ణం ఇలా ...

ఆనందపురం మండలంలో వరి సాధారణ విస్తీర్ణం 629 హెక్టార్లు, మొక్కజొన్న 7 హెక్టార్లు, పెసలు 3, మినుము 5, కందులు 7, చెరకు 2, వేరుశెనగ 22, నువ్వులు 75 హెక్టా ర్లలో కలిపి మొత్తంగా 750 హెక్టార్లు ప్రస్తుత ఖరీఫ్‌లో సాధారణ విస్తీర్ణం. పద్మనాభం మండలంలో వరి 2,522 హెక్టార్లు, మొక్క జొన్న 19, కొర్ర 1, పెసలు 5, మినుము 4, కందులు 5, చెరకు 105, వేరుశెనగ 24, నువ్వులు 345 మొత్తంగా 3030 హెక్టార్ల సాధారణ విస్తీర్ణం. భీమిలి మండలంలో వరి 537 హెక్టార్లు, మొక్క జొన్న 41, చోడి 9, పెసలు 1, మినుము 5, కందులు 3, వేరుశెనగ 62, నువ్వులు 55 మొత్తంగా 713 హెక్టార్ల సాధారణ విస్తీర్ణం, పెదగంట్యాడలో వరి 4, గంటి 4, బొబ్బర్లు 1, మొత్తం 10 హెక్టార్ల సాధారణ విస్తీర్ణం. మొత్తం డివిజన్ పరిధిలోని 4 మండలాల్లో వరి 3,692, గంటి 4, మొక్క జొన్న 67, చోడి 10, కొర్ర 1, పెసలు 9, మినుములు 15, కందులు 16, బొబ్బర్లు 1, చెరకు 107, వేరుశెనగ 108, నువ్వులు 475, మొత్తంగా 4,503 హెక్టార్లు సాధారణ విస్తీర్ణంగా ఉంది.

ఎకరా నారుమడికి 6 సెంట్లలో నారు

ఎకరా నారు మడికిగానూ 6 సెంట్లలో నారు వేయాలి. ఈ పద్ధతి అనుసరిస్తే ఎకరాకు 25 కిలోల విత్తనం సరిపోతుంది. విత్తన శుద్ధి తప్పని సరి. కిలో విత్తనానికి 2 గ్రాముల కార్బెండజం పొడి చల్లాలి. లేదా 8 గ్రాముల సూడో మోనస్ పొడి చల్లాలి. దీంతో విత్తనాన్ని కలిపి 5 గంటలు ఉంచిన తరువాత పొలంలో చల్లాలి. నారు మడిని మూడు దఫాలుగా దున్నాలి. తొలుత పొలాన్ని బాగా కలియ దున్నాలి. కలుపు పూర్తిగా నివారించాలంటే ఎకరాకు 2 బస్తాలు (సూపర్ ఫాస్ఫేట్) వెయ్యాలి. 6 సెంట్ల విస్తీర్ణంలో డిఎపి లేదా సూపర్ ఫాస్ఫేట్ 5 కిలోలు, పొటాష్ 2-3 కిలోలు వెయ్యాలి. నారు మొలిచిన 10 రోజుల తర్వాత 6 సెంట్ల నారు మడికి కిలోన్నర 3జి గుళికలు వెయ్యాలి. తద్వారా పీక పురుగు (కాండం తొలిచే పురుగు) నివారించ వచ్చు.



బొడ్డేపల్లి విజయప్రసాద్
అసిస్టెంట్ డైరెక్టర్
వ్యవసాయ శాఖ
భీమిలి డివిజన్

ఆటోలో పోగొట్టుకున్న సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆటోలో పోగొట్టుకున్న రూ.లక్ష సొత్తును ఆరిలోవ క్రైమ్ పోలీసులు గంటల వ్యవధిలో రికవరీ చేసి బాధితునికి అప్పగించారు. ఆరిలోవ క్రైమ్ ఎస్ఐ రుక్మాంగధరరావు కథనం ప్రకారం... ఒడిశా రాయఘడ్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి తన కుమార్తెను ఆరిలోవ, తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒక పరీక్ష నిమిత్తం శనివారం ఊబర్ ద్వారా బుక్ చేసిన ఆటోలో వచ్చారు. ఆటోలో దిగినప్పుడు తన వెంట తీసుకు వచ్చిన రూ.లక్షతో కూడిన బ్యాగ్‌ను మరిచిపోయారు. వెంటనే బాధితుడు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆరిలోవ క్రైమ్ ఎస్ఐ రుక్మాంగధరావు వెంటనే దర్యాప్తు చేపట్టారు. ఊబర్ ద్వారా బుక్ చేసిన ఆటో కావడంతో డ్రైవర్ ఎవరో తెలుసుకొని పోగొట్టుకున్న రూ.లక్షను ఆటో డ్రైవర్ నుంచి రికవరీ చేసి బాధితునికి అందజేశారు

పాముకాటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- హుకుంపేట: పాము కాటుకు గురై ఒ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి మండలం లోని పట్టాం పంచాయతీ అదే గ్రామానికి చెందిన సొభ హరినాద్(32) శనివారం ఉదయం తమ గ్రామం నుంచి కుమ్మరి పుట్టు గ్రామంలో క్రింద పొలం పనులు నిమిత్తం వరి కోతలు కోసేందు వేళారు. వరి కోతలు కోస్తున్న క్రమంలో ఎడమ కాలుకి పాము కాటు వేయడంతో అక్కడికక్కడే స్పృహ కోల్పోయాడు.



సిద్ధం చేసిన చందనం

ఆఖరి చందన సమర్పణకు సిద్ధం

ప్రజాశక్తి-సింహాచలం: ఆషాడ పౌర్ణమి రోజున సింహాద్రి అప్పన్న ఆఖరి విడత చందన సమర్పణ కోసం చందనాన్ని ఆదివారం సిద్ధం చేశారు. ఇప్పటికే సిద్ధం చేసిన చందనానికి సుగంధ పరిమళ ద్రవ్యాలను కలిపి సోమవారం సమర్పించేందుకు సిద్ధం చేశారు.

నవ్వుతో ఆరోగ్యం

ప్రజాశక్తి-సీతమ్మధార : మనిషి నవ్వు ద్వారా ఆరోగ్యకరంగా ఉంటారని కళావేదిక వ్యవస్థాపకులు డాక్టర్ నండూరి రామకృష్ణ తెలిపారు. పౌర గ్రంథాలయంలో ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యాన ఆదివారం వినోదాల విందు కామెడీ షో ప్రదర్శించారు. పెళ్ళాం ఊరెళితే, మొగుడికి ఫోన్ చేసి చెప్పాలా, తాగుబోతు రమేష్, రక్తం, న్యాయం కావాలా తదితర స్కిట్స్ ప్రేక్షకులు అలరించాయి. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ వ్యవస్థాపకులు ఎంవి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ప్రతినెలా మొదటి ఆదివారం ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిత్యం పని ఒత్తిడిలో ఉంటూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించకుండా పనిచేస్తున్న తరుణంలో నవ్వు ఆనందానికి ఎంతో సంపూర్ణం కలుగుతుందని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దాసరి సాంబశివరావు, తిలక్ పట్నాయక్, ఎన్‌వి.రామకృష్ణ, బాదంగిరి సాయి, హాస్య ప్రియా కామెడీ క్లబ్, లాఫ్టర్స్ ఫన్ క్లబ్బు, హ్యూమర్ ఫన్ క్లబ్, హాస్య దర్బార్ క్లబ్బు ప్రతినిధులు ప్రేక్షకులు పాల్గొన్నారు.



స్కిట్స్ ప్రదర్శిస్తున్న ఎంవి సుబ్రహ్మణ్యం

గ్రామాల్లో సమస్యలపై 4 నుంచి సిపిఎం సర్వే



సమావేశంలో మాట్లాడుతున్న గంగారావు తదితరులు

ప్రజాశక్తి -పద్మనాభం : గ్రామాల్లో సమస్యలపై సిపిఎం ఆధ్వర్యాన ఈ నెల 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు సర్వే నిర్వహిస్తామని జివిఎంసి 72వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు తెలిపారు. పలు గ్రామాల నుంచి వచ్చిన కార్యకర్తలతో ఆదివారం సమావేశమై మాట్లాడారు. పద్మనాభం మండలంలో ల్యాండ్ పూలింగ్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని రైతుల ఆందోళన చెందుతున్నారని, దీనిపై పక్కాగా సర్వే చేసి రైతులకు అండగా నిలుస్తామని చెప్పారు. ఆగస్టు నెలాఖరు నాటికి సర్వేను పూర్తి చేయాలని, అందుకు అందరి సహకారం కావాలని కోరారు. ప్రభుత్వాలే చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే పేద, బలహీన వర్గాలకు న్యాయం ఎక్కడ దొరుకుతుందన్నారు. మజ్జివలస రాజకుటుంబానికి చెందిన వైసిపి నాయకుడు భీమిలి మండలం లక్ష్మీపురం గ్రామంలో సుమారు 5 ఎకరాల భూమిని తన రాజకీయ పలుకుబడితో స్వాధీనం చేసుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడని, రైతుల నిలదీయడంతో భూమిపైకి రాలేకపోయాడని తెలిపారు. పద్మనాభం మండలంలో కనీసం ఉపాధి లేక ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామస్థాయిలో ప్రజలు సమస్యలను ముందుకు తీసుకొస్తే జిల్లా కలెక్టర్ దృష్టిలో పెడతామని చెప్పారు. నిరుపేద రైతుల దగ్గర ఉన్న భూములకు 22ఎ కింద చూపించి నిషేధించడం అన్యాయమన్నారు. గ్రామాల్లో సంఘాలు ఏర్పాటు చేసుకుంటే సమస్యలపై పోరాటం చేయగలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్‌ఎస్‌ఎన్.మూర్తి, రవ్వ నర్సింగరావు, రాము, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

'బీసీలను నిర్లక్ష్యం చేస్తే మనుగడ లేకుండా చేయాలి'

ప్రజాశక్తి- మాధవధార : సమాజంలో 52 శాతానికిపైగా ఉన్న బీసీలను నిర్లక్ష్యం చేస్తే రాజకీయ పార్టీలకు మనుగడ లేకుండా చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మాధవధార ఉడా కాలనీలో ఆదివారం తొలిసారిగా బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జాతీయస్థాయిలో వెనుకబడిన తరగతుల సమస్యలపై ప్రతినిధులు చర్చించారు. అనేక జాతీయ అంశాలపై తీర్మానాలు చేశారు. ముఖ్యంగా కులాల వారీగా జనగణన జరపాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని తీర్మానించారు. సమాజంలో బీసీల ఆర్థిక సామాజిక స్థితిగతులపై చర్చించిన సదస్సు వాటి మెరుగుదలకు, సమాజంలో బీసీలు గౌరవప్రదమైన స్థాయిని పొందడానికి అనేక సూచనలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చేసింది. బీసీల సంక్షేమం కోసం వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను సంక్షేమ కార్యక్రమాలను వాటి అమలు చర్చించింది. అనంతరం వక్తలు మాట్లాడుతూ, జాతీయస్థాయిలో ఈబీసీ, ఎంబీసీ, కుల గణన వంటి అంశాలను లేవనెత్తుతూ రాజీలేని పోరాటం చేస్తున్న ఆల్ ఇండియా బీసీ ఫెడరేషన్‌కు అన్ని రకాలుగా సహకరిస్తామన్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికలలో బీసీలకు జనాభా ప్రాతిపదికన ప్రోత్సహించిన రాజకీయ పార్టీలను మాత్రమే ఆదరించాల్సిందిగా వక్తలు బీసీ సమాజాన్ని కోరారు. రాజ్యాంగ సవరణ ద్వారా బీసీలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో రైల్వే కార్మిక నేత, అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పప్పల రామ్మోహన్‌రావును ఎబిబిసిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షులు జస్టిస్ వి.ఈశ్వరయ్య పంపిన ఆ నియామక ఉత్తర్వులను ఎబిబిసిఎఫ్ జాతీయ కార్యదర్శి ఆల్మన్‌రాజ్ ద్వారా రామ్మోహన్ రావుకు అందజేశారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న బీసీ నాయకులు రామ్మోహనరావును సన్మానించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావు మాట్లాడుతూ, తనకు అప్పజెప్పిన బాధ్యతలను స్వీకరిస్తూ బీసీల అభ్యున్నతికి కృషి చేస్తానని చెప్పారు. ఈ సమావేశంలో వివిధ బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



రామ్మోహన్‌రావును సన్మానిస్తున్న అల్మాన్‌రాజ్



హైకోర్టు జడ్జికి అప్పన్న చిత్రపటం బహూకరణ

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను హైకోర్టు జడ్జ్ మానవేంద్రరాయ్, రాష్ట్ర ఇండస్ట్రియల్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. వీరికి ఆలయ సహాయ కార్య నిర్వహణాధికారి భ్రమరాంబ సాదరంగా స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందించారు.



పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో కె.లక్ష్మణమూర్తి తదితరులు

విద్యార్థులకు నోటు పుస్తకాలు

ప్రజాశక్తి-ఆనందపురం : శ్రీ సత్యసాయి ఆదర్శ గ్రామం గొట్టిపల్లి ఇంటిగ్రేటెడ్ సేవా మందిరం బాల వికాస్ విద్యార్థులకు ఆదివారం నోటు పుస్తకాలు, ఇతర స్టేషనరీని పంపిణీ చేశారు. విశాఖ జిల్లా శ్రీ సత్యసాయి విద్యా విభాగం, ఆనందపురం భజనమండలి సభ్యుడు కొట్యాడ లక్ష్మణమూర్తి సంయుక్తంగా నోటు పుస్తకాలు, పెన్నులు, స్కేల్స్‌ను 50 మందికి సమకూర్చారు. వీటిని శ్రీ సత్యసాయి సేవా సంస్థలు విశాఖపట్నం జిల్లా జోన్ కో-ఆర్డినేటర్ ఎంవిఎస్ సాయికుమార్, దాత కొట్యాడ లక్ష్మణమూర్తి ద్వారా విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోరాడ నాయుడుబాబు, శ్రీ సత్యసాయి ఆదర్శ గ్రామం కో-ఆర్డినేటర్ డబ్బీరు విజయ్‌కుమార్, కన్వీనర్ కోరాడ తమ్ము నాయుడు, యూత్ కో-ఆర్డినేటర్ డి.శరత్‌కుమార్, బాల వికాస్ ఇన్‌ఛార్జి ఆధ్యాత్మిక కో-ఆర్డినేటర్ డివి సంతోష్ కిరణ్, ఎ.సుబ్రహ్మణ్యం, బిఎల్.రాజు, లాస్య తదితరులు పాల్గొన్నారు.



అప్పలనాయుడును సన్మానిస్తున్న వాకర్స్

గుర్రు అప్పలనాయుడుకు సన్మానం

ప్రజాశక్తి -మాధవధార : నేవల్ డాక్‌యార్డులో చార్జిమ్యాన్‌గా ఉద్యోగ విరమణ చేసిన గుర్రు అప్పలనాయుడును వైశాఖి స్పోర్ట్స్ పార్క్ వాకర్స్ ఆదివారం ఘనంగా సన్మానించారు. పూలమాలలు, శాలువాతో సత్కరించి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ శర్మ, రాఘవయ్య, నాయుడు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

అల్ట్రాసౌండ్‌పై వర్క్ షాప్



వర్క్ షాప్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ సతీష్ కుమార్

ప్రజాశక్తి- గాజువాక : కొత్త సాంకేతికతపై వైద్య నిపుణులకు అవగాహన కల్పించేందుకు పాయింట్ ఆఫ్ కేర్ అల్ట్రాసౌండ్ (పోకస్) అంశంపై కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్యంగా క్రిటికల్ కేర్ విభాగంలో అల్ట్రాసౌండ్ టెక్నాలజీని ఉపయోగించడంపై ఎనస్థీషియాలజిస్టులు, ఇంటెన్సివిస్టులు, ఎమర్జెన్సీ ఫిజిషియన్లతో పాటు పీజీ వైద్య విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో వివిధ ఆస్పత్రులు, వైద్య సంస్థల నుంచి 50 మందికిపైగా హాజరయ్యారు. పోకస్ విషయంలో పరిజ్ఞానంతో పాటు నైపుణ్యం ఉన్న వైద్యులు ఈ సెషన్లను నిర్వహించారు.

ఇందులో ప్రధానంగా ప్రాథమిక అల్ట్రాసౌండ్ ఫిజిక్స్, ఇమేజ్ ఎక్విజిషన్, ఇంటర్‌ప్రెటేషన్, గుండెకు, ఊపిరితిత్తులకు, ఉదర భాగానికి అల్ట్రాసౌండ్ స్కానింగ్ ఎలా చేయాలి, నరాల విషయంలో ఎలా చేయాలనే విషయాలను వివరించారు. ముందుగా ప్రత్యేకంగా రూపొందించిన బొమ్మలపై తమ నైపుణ్యాలను ప్రదర్శించి, తర్వాత నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో కొందరు రోగులకూ స్కానింగ్ చేయడానికి అవకాశం కల్పించారు.

ఈ సందర్భంగా కిమ్స్ ఐకాన్ క్రిటికల్ కేర్ విభాగానికి చెందిన లీడ్ కన్సల్టెంట్ డాక్టర్ ఎం.రవికృష్ణ, డాక్టర్ మల్ల హరిప్రసాద్, డాక్టర్ ఆర్‌వి.గణేష్, డాక్టర్ యశ్విని మాట్లాడుతూ, "అల్ట్రాసౌండ్ టెక్నాలజీని ఉపయోగించడం క్రిటికల్ కేర్ వైద్యంలో అంతర్గత భాగం అయిందన్నారు. రోగులకు ఉన్న సమస్య ఏంటన్న విషయాన్ని అత్యంత కచ్చితంగా, త్వరగా తెలుసుకోవడానికి, రోగి పరిస్థితిని అప్పటికప్పుడే పర్యవేక్షించడానికి, వాస్క్యులర్ యాక్సెస్, చెస్ట్ ట్యూబ్ ఇన్సర్షన్ లాంటి ప్రొసీజర్లకు ఇది చాలా ఉపయుక్తం" అని వివరించారు. భవిష్యత్తులో పాయింట్ ఆఫ్ కేర్ అల్ట్రాసౌండ్ (పోకస్) గురించి మరిన్ని వర్క్ షాప్‌లు నిర్వహిస్తామని కిమ్స్ యాజమాన్య ప్రతినిధులు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కిమ్స్ ఐకాన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సతీష్‌కుమార్ పెతకంశెట్టి, డాక్టర్ టి.మోహన్, ఎస్.మహరాజ్, డాక్టర్ టి.లక్ష్మీరాణి పాల్గొన్నారు.

పైపులైన్ పనుల పర్యవేక్షణ

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 60వ వార్డు పరిధిలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మంచినీటి పైపు లైన్ల పనులను వార్డు కార్పొరేటర్ పివి సురేష్ ఆదివారం పర్యవేక్షించారు. కాంట్రాక్టర్ నుంచి పనులు చేపడుతున్న తీరు ఇతర వివరాలనడిగి తెలుసుకున్న. అనంతరం సురేష్ మాట్లాడుతూ, కొండవాలు ప్రాంతం అధికంగా ఉన్న తమ వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యను జివిఎంసి కౌన్సిల్‌లో అడుగుపెట్టిన తొలిరోజే బలంగా వినిపించటం ద్వారా ఈ ప్రాజెక్టును సాధించుకున్నామన్నారు. గతంలో కోట్లాది రూపాయల ప్రజాధనంతో చేపట్టిన 24 గంటల మంచినీటి పైప్ లైన్ల పనులను మధ్యలోనే విడిచిపెట్టిన నేపథ్యంలో సదరు సమస్యను కౌన్సిల్‌లో వినిపించగా వెనువెంటనే స్పందించి మేయర్ హరివెంకటకుమారి, నాటి జివిఎంసి కమిషనర్ సృజన మంజూరు చేశారని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా పారిశ్రామిక ప్రాంతంలో నిరుపయోగంగా పడివున్న మూడు మంచినీటి ట్యాంకులు వినియోగంలోకి రావటం ద్వారా కొండవాలు ప్రాంతాల ప్రజల దాహార్తి తీరనుందని పేర్కొన్నారు. సురేష్ వెంట స్థానిక నాయకులు నారాయణరావు, చిన్నారెడ్డి, సత్తిబాబు, రమణ, భవానిరాజు, అనీల్, సంతోష్, నాగూర్, నాగబాబు తదితరులు ఉన్నారు.

వైభవంగా గిరి ప్రదక్షిణ

ప్రజాశక్తి-యంత్రాంగం

సింహాచలం: ఆషాడ పౌర్ణమి రోజున చేపట్టే గిరిప్రదక్షిణను ఆదివారం మధ్యాహ్నం దేవస్థానం ప్రచార రథానికి జెండా ఊపి అధికారికంగా ప్రారంభించారు. నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్‌వర్మ, వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం, ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొని రథాన్ని ప్రారంభించారు. సుదూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ప్రతి కిలోమీటర్‌కూ భక్తులకు అందుబాటులో మంచినీరు, సేద తీరేందుకు కుర్చీలు, టేబుల్స్ అందుబాటులో ఉంచారు. కొండచుట్టూ 32 కిలోమీటర్లు గిరిప్రదక్షిణలో భాగంగా భక్తుల కోసం సుమారు 200 తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. భక్తులకు దారిపొడవునా స్వచ్ఛంద సేవా సంస్థలు కాఫీ, ఫలహారాలతో పాటు టిఫిన్, భోజనాలను ఉచితంగా అందించారు. దేవస్థానం వారు ఎక్కడికక్కడ వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. గోశాల వద్ద ఆయుష్మాన్‌భవ ఆసుపత్రి ఎమ్‌డి కర్రి అప్పలస్వామి ఆధ్వర్యాన వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసి భక్తులకు సేవలందించారు.

తొలి పావంచ వద్ద కొబ్బరికాయ కొట్టే సమయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఎక్కువ కౌంటర్లను ఏర్పాటుచేశారు. భక్తులు నడిచే ప్రదేశంలో చెత్త లేకుండా పారిశుధ్య కార్మికుల తమ వంతు సేవలను అందించారు. అప్పుఘర్, జోడుగుళ్లపాలెం తదితత సముద్ర ప్రాంతాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా గజ ఈతగాలను అందుబాటులో ఉంచారు. తప్పిపోయే భక్తులను వారి బంధువులకు తెలియజేసేందుకు ఎక్కడ అక్కడ ప్రచారం చేసే కౌంటర్లు అందుబాటులో ఉంచారు. ఎండను, సాయంత్రం వర్షాన్ని సైతం లెక్కచేయక భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఈ ఏడాది భక్తులు సుమారు ఆరేడులక్షల మంది గిరి ప్రదక్షిణలో పాల్గొన్నట్టు ఓ అంచనా. ఈ ఏడాది స్వామి వారి ప్రచార రథం సుమారు నాలుగు గంటల ప్రాంతానికే హనుమంతువాక దాటి వెళ్లడంపై భక్తులు అసహనం వ్యక్తం చేశారు. 32 కిలోమీటర్ల దారి పొడవునా పూర్తిస్థాయిలో వీధిదీపాలు ఏర్పాటు చేయడంతో భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా యాత్ర సాగించారు. ఈ ఏడాది ఆదివారం ఉదయం 6 గంటల నుంచే భక్తులు గిరిప్రదక్షిణలో పాల్గొనడం కనిపించింది.

లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు



గిరిప్రదక్షిణ రథం వద్ద సిద్ధంగా ఉన్న భక్తులు

గిరిప్రదక్షిణకు భక్తులు

పద్మనాభం : సింహాచలం గిరి ప్రదక్షిణకు విజయనగరం జిల్లాలోని పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పద్మనాభం మీదుగా వాహనాలపై తరలివెళ్తున్నారు. ఈ భక్తులతో ఆర్టీసీ బస్సులు కూడా రద్దీగా తిరుగుతున్నాయి.

మందుల పంపిణీ

ఆరిలోవ : సింహగిరి ప్రదక్షిణ చేసే భక్తులకు స్థానిక 12వ వార్డు పెదగదిలి కూడలిలో వైసిపి సీనియర్ నాయకులు ఇజ్జాడ సత్యనారాయణ ఆధ్వర్యాన మెడికవర్ ఆసుపత్రి సౌజన్యంతో భక్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, వైసిపి నాయకులు అక్కరమాని వెంకటరావు హాజరై భక్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర సాంస్కృతిక విభాగం డైరెక్టర్ ధూళి రఘు, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అనారోగ్యం పాలైన వారికి మందులు అందజేస్తున్న మేయర్ హరివెంకటకుమారి

జీరా రైస్, మజ్జిగ పంపిణీ

పిఎం పాలెం : గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు తెలుగు యువత ఉపాధ్యక్షులు గరే గురునాథ్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన జీరా రైస్, మజ్జిగ, బిస్కెట్లు, చాక్లెట్లు, శీతల పానీయాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భీమిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు హాజరై ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సత్యనారాయణ, పోతిన రమణ, పిల్లా రమేష్, పోతిన నాయుడుబాబు, దాస్, పిల్లా శ్రీను, గుజ్జారి రాజు, పిల్లా నరేష్, సిహెచ్.ప్రసాద్, రమణ, కెవిఆర్ కేటరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



భక్తులకు ప్రసాదం అందిస్తున్న కోరాడ రాజబాబు తదితరులు

వైవి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే చెప్తే ప్రభుత్వ భూమి ఇచ్చేస్తారా?

కలెక్టర్‌కు బండారు సూటి ప్రశ్న

ప్రజాశక్తి-పెందుర్తి : వైవి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే చెబితే ప్రభుత్వ భూమిని ఇచ్చేస్తారా అని కలెక్టర్‌ను మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ప్రశ్నించారు. 97వ వార్డు పరిధి సుజాతనగర్ టిడిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సుజాతనగర్ మెయిన్ రోడ్డుకు ఆనుకొని సర్వేనెంబర్ 123/4, 5లో ప్రభుత్వ భూమి ఉందని గతంలో తహశీల్దార్, టౌన్ ప్లానింగ్ అధికారులు చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. వైవి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే చెప్పారని అడ్వకేట్ జనరల్ చెబితే ప్రభుత్వ భూమిని ప్రయివేటు వారికి కట్టబెట్టేందుకు కలెక్టరు ఓకే అనడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. మార్కెట్ వాల్యూ ప్రకారం ఇవ్వమని చెప్పినా ఒకే కుటుంబంలో ముగ్గురికి మార్కెట్ రేటు ప్రకారం ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఆ భూమిని కాజేయడానికి గతంలో ఒక నాయకుడు టిడిపిలో చేరాడని, తాము అంగీకరించకపోవడంతో తర్వాత వైసిపిలో చేరి ఆరేళ్ల తర్వాత తర్వాత కోర్టు పేరుతో కైవసం చేసుకునే పన్నాగం పన్నాడని ఆరోపించారు. కలెక్టర్ ఆ భూమిని చూసే ఇచ్చారా అని ప్రశ్నించారు. ఈ స్థలంపై పూర్తి దర్యాప్తు చేయాలని డిమాండ్‌చేశారు. గతంలో ఈ భూమిలో పేదలకు ఇళ్ల కోసం కమ్యూనిస్టులు భూపోరాటం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ స్థలానికి అనుకొని వెనుకవైపు గెడ్డ ఉందని ముందువైపు షెట్‌బ్యాక్ వదిలితే అసలు స్థలమే మిగలదని వివరించారు. సుమారు 26 సెంట్లు భూమిని ప్రభుత్వ అధికారులు కాపాడాలని కోరారు. టిడిపి ప్రభుత్వం వస్తే దీనిపై దృష్టిసారిస్తామని చెప్పారు. ప్రభుత్వ భూములు చాలా వరకు కబ్జా జరుగుతున్నాయని, వాటిపై రెండు రోజుల తర్వాత మీడియాను తీసుకొని ఆ స్థలాల్లోకి వెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్.శంకరరావు, ఆవగడ్డ అప్పలనాయుడు, దాట్ల మధు, గల్లా వెంకటరమణ పాల్గొన్నారు.

రహదారి పనుల పరిశీలన

ప్రజాశక్తి-సీతమ్మధార : గిరిప్రదక్షిణను పురస్కరించుకొని నరసింహనగర్ జంక్షన్ నుంచి కైలాసపురం, ఎన్జీవోస్ కాలనీ, మాధవధార, ఆర్ అండ్ బి జంక్షన్ వరకు రహదారి పనులను ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ఆదివారం పరిశీలించారు. ఆ ప్రాంతాల మీదుగా గిరిప్రదక్షిణ చేసే భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కె.అనీల్‌కుమార్ రాజు, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, ఆళ్ల లీలావతిశ్రీనివాసరావు, కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, ఇఇ శ్రీనివాస్, డి భరణి, ఎఇ అర్చన, రవణమ్మ, వైసిపి నాయకులు పేడాడ రమణి కుమారి, కిరణ్‌రాజు, పైడి రమణ, నీలి రవి, అంబటి శైలేష్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కెకె.రాజు

ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు ఉపయోగం

ప్రజాశక్తి- గాజువాక : ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో ఉపయోగకరమని, వారు సద్వినియోగం చేసుకోవాలని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు కోరారు. వార్డులోని భానోజితోట కనకదుర్గమ్మ ఆలయం వద్ద "వి డెంటల్" హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం మెగా దంత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా నరసింహపాత్రుడు పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. దంత సంబంధిత సమస్యలు ఉన్నవాళ్లు వైద్యుల సూచనలను పాటించాలన్నారు. ముఖ్యంగా చిన్నారుల్లో ఎక్కువగా ఈ సమస్య ఉంటుందని చెప్పారు. ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం పనికిరాదని తెలిపారు. పిల్లల దంత సంరక్షణ విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. హాస్పిటల్ డైరెక్టర్ ఎం.హరికిషోర్ మాట్లాడుతూ, కొండవాలు ప్రాంతాలు, మురికివాడల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు హర్షిత, పూజిత వైద్య సేవలు అందించారు. హాస్పిటల్ సిఇఒ ఎం.వరలక్ష్మి, స్థానిక నాయకులు మద్దాల అప్పారావు, లోకనాథం, రమణ, వెంకటరావు, కుమార్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు కాక సాగుకు దూరం!


లక్కవరంలో పల్లపు భూముల్లో వేసిన సరుగుడు తోట

- బీడులుగా మారుతోన్న నీటి ఆధారిత భూములు
- పల్లపు పొలాల్లోనూ తోటల పెంపకం
- ప్రభుత్వం సాయమందిస్తేనే వ్యవసాయానికి పూర్వవైభవం

ప్రజాశక్తి- చోడవరం :గిట్టుబాటు కాని వ్యవసాయంతో నానాటికీ రైతన్నలు సాగుకు దూరమైపోతున్నారు. ముఖ్యంగా సాగునీటి ఆధారం ఉండి, వరి వంటినీటి ఆధారిత పంటలను పండించే పల్లపు భూముల్లో పంటలను వేసే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ఒకపుడు బంగారు భూములుగా పిలవబడే పల్లపు భూములన్నీ ఇపుడు సాగుకు దూరమై బీడులుగా మిగిలిపోతుండగా, ఆయా భూముల్లో తోటల పెంపకంవైపు రైతులు మొగ్గు చూపుతున్నారు.

వ్యవసాయం చేసేవారు సాగుకు దూరమవుతుండడంతో, నీటి ఆధారం ఉన్న భూములు బీడులుగా దర్శనమిస్తున్నాయి. రైతుల పూర్తిగా పాడిపైనే ఆధారపడవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. తమకున్న పొలాల్లో పశుగ్రాసం గడ్డి వేసుకుని పశువుల పెంపకం పై మక్కువ చుపుతున్నారు. పల్ల భూముల్లోనూ మెట్ట భూముల్లో సాగు చేసే సరుగుడు, యూకలిప్టస్, పామాయిల్, హైబ్రిడ్ వేప, కొబ్బరి తోటల పెంపకం, కొన్నిచోట్ల చేపల చెరువులుగా రూపాంతరం చేసే పనులను చేపడుతున్నారు.

చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు సస్యశ్యామలంగా నీరు అందించే కోనాం, పెద్దేరు, రైవాడ, కల్యాణపులోవ, తారకరామ రిజర్వాయర్లు ఉన్నాయి. వీటి కింద చెరుకు, వరి విరివిగా సాగు అయ్యేది, ఖరీఫ్, రబీ సీజన్ లోను వరి పంట సాగు చేసేవారు. పెట్టుబడులు విపరీతంగా పెరగడంతో కూలీలు కొరత, కూలి రేట్లు పెంచడం ఎరువులు పురుగుమందులు విత్తనాలు వంటి వాటికి ప్రభుత్వం రాయితీలు తగ్గించడం వంటి కారణాలతో రైతులకు ప్రధాన పంటలైన వరి, చెరకు సాగు గిట్టుబాటు కాని పరిస్థితి ఉంది. దీతో తమ అవసరాలకు సరిపడా వరి, చెరకు పండిస్తున్న రైతులు, మునుపటిలో అన్ని పొలాల్లోనూ ఆయా పంటలను అధిక విస్తీర్ణంలో వేయడానికి సాహసించ చేయలేకపోతున్నారు. చోడవరం మండలంలో లక్కవరం, పి ఎస్ పేట, లక్ష్మీపురం, జన్నవరం, బెన్నవోలు గ్రామాల్లో సరుగుడి తోటలో అధికంగా వేశారు.

గణనీయంగా తగ్గిన పల్లపు భూముల కౌలు

పోనీ శిస్తుకు ఇచ్చి, కౌలురైతులు సాగుచేసేందుకు ఇద్దామన్నా వారూ ముందుకు రాని పరిస్థితి ఉంది, గతంలో ఎకరా భూమికి రూ.15 వేల వరకు ఏడాదికి శిస్తు ఇచ్చేవారు. ప్రస్తుతం కస్పా భూములుగా పిలవబడే వద్దాది, కేజే పురం భూములకు రూ.ఆరువేలు నుండి రూ.ఏడు వేలకు మించి శిస్తు ఇచ్చి సాగుచేసేందుకు కౌలురైతులు ముందుకు రావడం లేదు. అందుకూ కారణం లేకపోలేదు. కౌలుకు వ్యవసాయం చేద్దామంటే, తమ కష్టంతోపాటు పెట్టుబడి కూడా పోతుందని కౌలు రైతులు వాపోతున్నారు. ప్రభుత్వాలు రైతులు కనిపిస్తున్న అందిస్తున్న అరకొర సాయం ఏమాత్రం వ్యవసాయానికి సాయపడదని రైతులు అంటున్నారు. బెల్లం, ధాన్యం, ఇతర పంటలకు గిట్టుబాటు ధర లభిస్తే తప్ప మరలా వ్యవసాయానికి పూర్వ వైభవం రాదని రైతులు అంటున్నారు.

ఆశాలను ఇబ్బందులకు గురిచేయడం తగదు

సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు


నేలపైనే కూర్చున్న ఆశ కార్యకర్తలు

ప్రజాశక్తి -అనకాపల్లి : సాంకేతికంగా పనిచేయని సెల్‌ఫోన్లు ఇచ్చి, వాటి పరిష్కారం పేరుతో ఆశాకార్యకర్తలను జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయానికి పెద్దసంఖ్యలో రప్పించి ఇబ్బందులకు గురిచేయడం తగదని సిఐటియు జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు విమర్శించారు. పనిచేయని సెల్‌ఫోన్ల సమస్య పరిష్కారం పేరుతో ఒకేరోజు పది పిహెచ్‌సిల పరిధిలోని దాదాపు 300 మంది ఆశాకార్యకర్తలను డిఎంహెచ్‌ఓ కార్యాలయానికి రప్పించడంతో వారంతా తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కార్యాలయంలో కూర్చునేందుకు సరైన సౌకర్యం లేని పరిస్థితుల్లో వరండాలోనే చాలాసేపు పడిగాపులు పడ్డారు. ఒకేరోజు 300 మంది ఆశాలను రప్పిస్తే, వారి సెల్‌ఫోన్ సమస్య ఎలా, ఎప్పటికి పరిష్కారమౌతుందని శంకరరావు ప్రశ్నించారు. సుదూర ప్రాంతాల నుంచి ఆశాలను ఇలా రప్పించి ఇబ్బందులకు గురిచేయడం తగదని, వారు వచ్చిపోయేందుకు, ఇక్కడ పని పూర్తయ్యేంత వరకు ఎంత ఇబ్బందులకు గురవుతారో అధికారులు గుర్తించాలన్నారు. ఆశా కార్యకర్తల సెల్‌ఫోన్ల సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత టెక్నికల్ సిబ్బందిని మండల కేంద్రాలకు గానీ, పిహెచ్‌సిలకు గానీ పంపి అక్కడ పరిష్కరిస్తే ఆశాలకు ఇబ్బందులు ఉండేవి కాదన్నారు. దీనిపైజిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారులు దృష్టి పెట్టితగు చర్యలు తీసుకోవాలని కోరారు. డిఎంహెచ్‌ఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

వైసిపి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడకు ఘనస్వాగతం


రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న బొడ్డేడ, అమర్

ప్రజాశక్తి-అనకాపల్లి : వైసిపి జిల్లా అధ్యక్షునిగా నియమితులైన తర్వాత అనకాపల్లి వచ్చిన బొడ్డేడ ప్రసాద్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఆదివారం తిరుపతి నుంచి నేరుగా అనకాపల్లి చేరుకున్న ప్రసాద్‌ను రైల్వేస్టేషన్ వద్ద స్వాగతించిన అభిమానులు కార్యకర్తలు, నాయకులు, ఊరేగింపుగాఅనకాపల్లి పార్టీ కార్యాలయానికి తీసుకొచ్చారు. అక్కడ మంత్రి అమర్‌నాథ్‌ను కలవగా, పూలమాలలతో సత్కరించారు. అనంతరం పార్టీ కార్యాలయ ఆవరణలోని రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి అమర్‌నాథ్, డిసిసిబి మాజీ చైర్మన్‌సుకుమార వర్మ, దంతులూరి దిలీప్, చిక్కాల రామారావు, జెడ్‌పిటిసి ఈర్లె అనురాధ, భీశెట్టి సత్యవతి, శ్రీధర్ రాజు,బాబు, గొలవెల్లి శ్రీనివాసరావు, మనసాల కిషోర్, ఎంపిపిలు లక్ష్మీ గున్నయ్య నాయుడు, గొర్లి సూరిబాబు, కార్పొరేటర్ జాజుల ప్రసన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ పలక యశోద రవి, రాష్ట్రగవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడా శివ, పెదిశెట్టి గోవింద్, పార్టీలో వివిధ పదవుల్లో ఉన్న నాయకులు, వైసిపి కుటుంబ సభ్యులు బొడ్డేడ ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రత్యేక వాహనంపై మంత్రి అమర్‌నాథ్‌తో కలిసి పార్టీ కార్యాలయం నుంచి ఊరేగింపు నిర్వహించి, రింగు రోడ్డు మీదుగా చిన్న నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనకాపల్లి పూడిమడక రోడ్డు జంక్షన్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి కూడా పూలమాల వేసి నివాళులర్పించారు. వేలాదిమంది అభిమానులు బైక్ ర్యాలీతో బొడ్డేడను మునగపాకకు తీసుకువెళ్లారు. బొడ్డేడ జిల్లా అధ్యక్ష బాధ్యతలను స్వీకరించడంతో పార్టీ కేడర్‌లో నూతన ఉత్సాహం నెలకొంది.

బైక్ ర్యాలీతో బొడ్డేడకు ఘన స్వాగతం

అచ్యుతాపురం :వైసిపి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన బొడ్డేడ ప్రసాద్‌ను స్వాగతించేందుకు మునగపాక, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల వైసిపి నేతలు, కార్యకర్తలు, అభిమానులు భారీ బైక్ ర్యాలీగా తరలివెళ్లారు. వైసిపి మండలశాఖ అధ్యక్షుడు దేశెట్టి శంకరరావు, జెడ్‌పిటిసి లాలం రాము, సీనియర్ నేత కోన బుజ్జి, పిన్నమరాజు వాసు పాల్గొన్నారు.


వచ్చే ఎన్నికల్లో వైసిపిదే విజయం : బొడ్డేడ

మునగపాక రూరల్: వచ్చే ఎన్నికలలో వైసిపి విజయదుందుభి ఖాయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్ష బాధ్యతల స్వీకరించిన తర్వాత పార్టీ శ్రేణుల స్వాగత, సందోహాల మధ్య మునగపాక సందీశ్వర కల్యాణమండపానికి చేరుకున్న బొడ్డేడ ప్రసాద్‌కు ఆయనకు అక్కడ ఘన పౌరసత్కారం లభించింది. ఈ సందర్భంగా బొడ్డేడ మాట్లాడుతూ, గవర కార్పొరేషన్ చైర్మన్‌గా తొలుత తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ఇపుడు జిల్లా అధ్యక్షబాధ్యతలతోమరో గురుతర బాధ్యతలు అప్పగించారన్నారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే కన్నబాబురాజు చొరవతో తనకు పదవి దక్కిందని, వారికి ధన్యవాదాలు తెలిపారు. త్వరలో అనకాపల్లిలో పార్టీకి చెందిన అందరు ఎమ్మెల్యేలు, ఎంపి, ఇతర నేతలతో బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. డిసిసిబి మాజీ చైర్మన్ సుకుమార్ వర్మ మాట్లాడుతూ గ్రూపులకు తావులేకుండా, జిల్లాలో అందరినీ సమన్వయం చేస్తూ పార్టీని ముందుకు తీసుకెళ్లగల సత్తా ఉందన్నారు. వైసిపి మండల కన్వీనర్ ఆడారి గణపతి అచ్చం నాయుడు అధ్యక్షతన జరిగినకార్యక్రమంలో జెడ్‌పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపిపి మల్ల జయలక్ష్మి,సర్పంచులు దిమ్మల అప్పారావు, కాండ్రేగుల నూకరాజు, బొడ్డేటి శ్రీనివాసరావు, బీసెట్టి గంగ అప్పలనాయుడు,వైసిపి నేతలు దాసరి అప్పారావు, పొలిమేర గణేష్, టెక్కలి కొండలరావు, పాల్గొన్నారు.

నేటి గురుపౌర్ణమికి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి- కె.కోటపాడు.:స్థానిక షిరిడి సాయి మందిరంలో సోమవారం గురు పౌర్ణమి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశామనిఆలయ కమిటీ చైర్మన్ వేగి రామారావు తెలిపారు. ఆదివారం దీనికి సంబంధించిన ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ గురుపౌర్ణమి ఉత్సవాలలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఆర్ కె ఇన్‌ఫ్రా బ్రాంచ్ మేనేజర్ జి.రూపదేవి, యలమంచిలి ధర్మారావు, ఎం.ఈశ్వరరావు, ఎస్. రామారావు, సురేష్, ఎ.వెంకట లక్ష్మీ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం


బాధితులకు నగదు సాయం అందజేస్తున్న పైలా

ప్రజాశక్తి- కె.కోటపాడు :మండలంలోని ఎ. భీమవరం గ్రామంలో అగ్ని ప్రమాద బాధితులకు మాడుగుల నియోజకవర్గ టిడిపి సీనియర్ నేత పైలా ప్రసాదరావు రూ.పది వేలు ఆర్థికసాయం అందించారు. ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో గ్రామానికి చెందిన పి. అచ్చుబాబు, టి.సోమినాయుడు తీవ్రంగా నష్టపోయారు.. బాధితులకు చెందిన గడ్డివాములు. పశువుల పాకలు. ధాన్యం పూర్తిగా కాలిపోయి, భారీ ఆస్తి నష్టం జరిగింది. ఈ సందర్భంగా పైలా ప్రసాదరావు మాట్లాడుతూ, బాధితులకు తన వంతుగా ఆర్థికసాయాన్ని అందజేసానని వెల్లడించారు. బాధితులను పరామర్శించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రొంగలి మహేష్. పూడి నారాయణమూర్తి, కుమార ధనంజయ, టి అప్పారావు, కుమార గంగునాయుడు పాల్గొన్నారు

మామిడితాండ్రకు మంచి గిరాకీ


సీలేరు సంతలో అమ్ముతున్న మామిడి తాండ్ర ఉండలు

ప్రజాశక్తి -సీలేరు: మన్యంలో పండిన మామిడిపళ్లతో ఏజెన్సీవాసులు సహజసిద్ధంగా తయారుచేసిన తాజా మామిడితాండ్రకు మంచి గిరాకీ ఉంటుంది. సీలేరులో ఆదివారం వారపుసంతలో మామిడితాండ్ర ఉండలుహాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. మండలంలోని పిల్లిగెడ్డ, కాట్రగెడ్డ, దుప్పిలివాడ, చల్లని శిల్ప, కొమ్ములువాడ, తదితర మారుమూల గ్రామాల నుంచి గిరిజనులు తాము సొంతంగా తయారుచేసిన మామిడి తాండ్రను సీలేరు వారపుసంతకు అమ్మకానికి తేగా, ఒక్కో ఉండను రూ.50 చొప్పున విక్రయించగా, పలువురు ఎంతో ఆసక్తితో కొనుగోలు చేశారు.

మామిడి తాండ్రకుఈ ప్రాంతంలో ఒక ప్రత్యేకత ఉంది.చుట్టుపక్కల అటవీ ప్రాంతంలో పండిన మామిడిపళ్లను సేకరించి, వాటిని గుజ్జును తీసి, ఒక గుడ్డపై రోజూ వేసి ఎండలో ఆరబెడతారు. ఇలా దాదాపు ఇరవై రోజులపాటు అనేక పొరలుగా ఎండబెట్టిన మామిడి తాండ్రను తర్వాత ఈనెలుగా కోత కోసి, ఉండలుగా చుట్టి, వారపుసంతకు విక్రయానికి తెస్తారు. మైదానప్రాంతంలో తయారుచేసే మామిడి తాండ్ర కంటే ఏజెన్సీలో సహజసిద్ధంగా తయారుచేసిన మామిడితాండ్రను కొనేందుకు ప్రజలు మక్కువ చూపుతారు. ఆదివారం వారపుసంతలో తాండ్ర ఉండ రూ.50 చెప్పినప్పటికీ, పలువురు కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరిచారు.

పాడైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పట్టించుకోరా?

- మూడు నెలలుగా సాగునీటికి రైతుల అవస్థలు
- ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోని అధికారులు
- విద్యుత్ కార్యాలయం ముట్టడికి రైతుసంఘం హెచ్చరిక



పాడైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రైతు సంఘం ఆందోళన

ప్రజాశక్తి- కోటపాడు: పాడైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మూడునెలలుగా పట్టించుకోకుండా సంబంధిత విద్యుత్‌శాఖ సిబ్బంది, రైతులు, వినియోగదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఏపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వేచలపు కాసుబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం సిపిఐ, రైతు సంఘం నేతలు ఆయా గ్రామాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. ఈసందర్భంగా కాసుబాబు మాట్లాడుతూ, మండలంలోని మర్రివలస, గొండుపాలెం, శృంగవరం తదితర గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మూడు నెల క్రితం వచ్చిన తుఫానుకు పూర్తిగా కాలిపోయాయన్నారు. . వ్యవసాయ బోర్లు ఆధారంగా కూరగాయలు, ఇతర పంటలు పండించి, జీవనోపాధి పొందుతున్న రైతులు, మూడు నెలలుగా బోర్లు పనిచేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారన్నారు వ్యవసాయబోర్లు పనిచేకపోవడంతో సాగునీరు అందక కూరగాయాలు, ఇతర పంటలు పాడైపోతున్నాయని ఆవేదన చెందుతున్నారన్నారు. మర్రివలస గ్రామంలో మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, గొండుపాలెం, శృంగవరం గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయని ఆయా గ్రామాల రైతులు విద్యుత్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారే తప్ప, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టకపోవడం దుర్మార్గమన్నారు. నెలల తరబడి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పాడైతే, రైతులు పంటలను ఎలా పండించుకుంటారని ప్రశ్నించారు. అధికారులు తక్షణమే స్పందించి, పాడైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానే కొత్తవి బిగించడమో, లేకుంటే ఉన్నవాటిని మరమ్మతులు చేసైనా వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని కోరుతున్నారు. లేకుంటే రైతులను సమీకరించి, విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నా చేసి ముట్టడిస్తామని హెచ్చరించారు. సిపిఐ మండల కార్యదర్శి గొర్లె దేవుడుబాబు, రెడ్డి అప్పలనాయుడు , ఇల్లాకు రాము, సీముసురు సూర్యనారాయణ, దమ్ము ముత్యాల నాయుడు పాల్గొన్నారు.

వైభవోపేతంగా గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణ చేస్తున్న తోటాడ పరిసర గ్రామ ప్రజలు

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : మండలంలోని తోటాడ గ్రామంలో ఆదినారాయణ స్వామి రాజయోగాశ్రమం ట్రస్టు ఆధ్వర్యంలో గురుపౌర్ణమి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం గిరిప్రదక్షిణ నిర్వహించారు.. స్థానిక ఓంకార పీఠం నుంచి త్రిమూర్తుల ఆలయం, పాటిపల్లి కాలనీ, వరాహ నరసింహమూర్తి ఆలయం, నారాయుడుపాలెం మీదుగా గిరిప్రదక్షిణ నిర్వహించి తిరిగి ఓంకార పీఠంకు చేరుకున్నారు. తోటాడ పరిసర గ్రామాల నుంచి విచ్చేసిన భక్తులంతా భజనలు చేస్తూ గిరిప్రదక్షిణ వేడుకలో పాల్గొన్నారు. 3న సోమవారం గురుపౌర్ణమి సందర్భంగా ఓంకార పీఠం ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు మేనేజింగ్ ట్రస్టీ సూరిశెట్టి సుషుమ్న కుమార్ తెలిపారు .వేడుకల సందర్భంగా శ్రీమాతా మహాలక్ష్మీ తేజోమహల్, ఓంకార పీఠాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

వైసిపి నేతలను పరామర్శించిన ఎమ్మెల్యే



పి. అగ్రహారం సర్పంచ్‌ను పరామర్శిస్తున్న అదీప్‌రాజ్

ప్రజాశక్తి-సబ్బవరం: మండలంలోని పైడివాడ అగ్రహారం సర్పంచ్ వడ్డాది అప్పలరాజును పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదివారం పరామర్శించారు. ఇటీవల విద్యుత్‌స్తంభం పడి సర్పంచ్ అప్పలరాజు గాయపడిన సమాచారం తెలుసుకుని, అతని ఇంటికి వెళ్లి పరామర్శించారు. వైద్యం ఎలా అందుతుందో అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇటీవల పాముకాటుతో అస్వస్థతకు గురైన ఇరువాడ పంచాయితీకి చెందిన మరో వైసిపి నేత బంగారు నాయుడును కూడా అతని ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే అ దీప్‌రాజ్ పరామర్శించి, బాగోగులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైసిపి నేతలు కోటాన రాము, సబ్బవరపు ముత్యాలనాయుడు, కర్రి బాబు మోపాడ అప్పారావు, కాపుశెట్టి శేషుబాబు, ఎంపిటిసి కర్రి అప్పారావు, పెచ్చెట్టి రమేష్ నాయుడు దాసరి శ్రీను పాల్గొన్నారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత



అప్పారావుకు పింఛను ఇస్తున్న వాలంటీరు మహాలక్ష్మినాయుడు

ప్రజాశక్తి -వడ్డాది : బుచ్చయ్య పేట మండలం విజయరామ రాజుపేట గ్రామానికి చెందిన శరగడం అప్పారావు కొద్ది రోజులుగా అనారోగ్యం తో బాధపడుతూ విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్నారు నెలవారీ ఇచ్చే పింఛను తీసుకునేందుకు గ్రామా నికి రాలేని స్థితిలో అప్పారావు ఉండడంతో, గ్రామ వాలంటరీ బొడ్డేటి మహాలక్ష్మి నాయుడు స్పందించి, తన సొంత ఖర్చులతో విశాఖ కెజిహెచ్‌కు వెళ్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అప్పారావుకు పింఛను సొమ్ము అందజేశారు. వాలంటీరు చొరవను లబ్ధిదారుని కుటుంబ సభ్యులు, తోటి మిత్రులు, సర్పంచ్ యల్లపు విజయ్ కుమార్ అభినందించారు

జగనన్న సురక్షతో ప్రజలకు చేరువగా ప్రభుత్వం

మంత్రి గుడివాడ అమర్‌నాథ్



కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి-అనకాపల్లి : క్షేత్రస్థాయిలోనే ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువ కాబోతోందన్నారు. ఆదివారం మండలంలోని గోపాలపురంలో ఎంపిపి గొర్లి సూరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలను లబ్ధిదారులకు అందజేశారు. గ్రామంలోని సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో రూ.7.50లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని, రూ.10 లక్షలతో నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని ప్రారంభించారు. రూ. కోటి వ్యయంతో నిర్మించిన గోపాలపురం నుంచి పెదముషిడివాడ రోడ్డును, రూ.23.50 లక్షలతో నిర్మించిన వెల్నెస్ సెంటర్‌ను రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు.

జగనన్న సురక్షలో నెలరోజులపాటు ప్రజలు తమకు అవసరమైన ధ్రువపత్రాలను ఎటువంటి రుసుము లేకుండా ఉచితంగా పొందవచ్చన్నారు. ప్రతి క్లస్టర్‌లోనూ ఇంటింటికీ వచ్చే సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గృహ సారథులు, కన్వీనర్లుకు ప్రజలు తమ సమస్యలను తెలియజేస్తే కేవలం 24 గంటల్లోనే పరిష్కరించి, ధ్రువపత్రాలను మంజూరు చేస్తారన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగన్మోహనరెడ్డి ప్రతి చిన్న సమస్యనూ పరిష్కరించే దిశగా యంత్రాంగాన్ని ముందుకు నడుపుతున్నారన్నారు.. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, జెడ్‌పి వైస్ చైర్మన్ బివి. సత్యవతి, ఎంపిపి సూరిబాబు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

విశ్రాంత డిఎంహెచ్ఒకు సత్కారం



డాక్టర్ సూర్యనారాయణను సత్కరిస్తున్న ఎంపీ దంపతులు

ప్రజాశక్తి- అనకాపల్లి : సమాజానికి సేవ చేయడంలో వైద్యులు భగవంతునితో సమానమని ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి, డాక్టర్ విష్ణుమూర్తి అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇండియన్ మెడికల్ అసోసియేషన్, అనకాపల్లి బ్రాంచ్ ఆధ్వర్యంలో ఐఎంఎ భవనములో ప్రముఖ వైద్యులు, పూర్వ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సూర్యనారాయణను ఎంపీ దంపతులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఎంపీ దంపతులను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు సన్మానించారు.కార్యక్రమంలో డాక్టర్ బెనర్జీ, డాక్టర్ చంద్రమౌళి, డాక్టర్ జానకి, డాక్టర్ మాధురి, డాక్టర్ నవీన్, డాక్టర్ యామిని, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ గాంధీ,డాక్టర్ నగేష్ గుప్తా, అనకాపల్లి మెడికల్ అసోసియేషన్ సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు.

బోరు మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి -వడ్డాది: బుచ్చయ్యపేట మండలం బంగారుమెట్ట శివాలయం వద్ద నెలరోజుల క్రితం పాడైన బోరును బాగుచేసే నాథులే లేరని స్థానికులు వాపోతున్నారు. బోరు పనిచేయకపోవడంతో శివాలయం, ఎల్లమ్మతల్లి గుడికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామంలో ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేసినప్పటికీ, గుడి వద్ద బోర్ లేకపోవడంతో భక్తులతోపాటు దేవాలయ అర్చకులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. దీనిపై అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీగానీ, సంబంధిత అధికారులుగానీ స్పందించి, శివాలయం వద్ద నెలరోజుల క్రితం పాడైన బోరును వెంటనే బాగుచేయించి, భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పడమటమ్మను దర్శించుకున్న పీలా

ప్రజాశక్తి - కశింకోట: మండలంలోని విస్సన్నపేట పడమటమ్మ లోవలో కొలువైన పడమటమ్మ తల్లిని ఆదివారం మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు కాయల మురళి, మళ్ల సురేంద్ర, పొలవరపు త్రినాథ్, బొడ్డపు ప్రసాద్, సిదిరెడ్డి శ్రీనివాసరావు, వేగి గోపీకృష్ణ, చిదిరెడ్డి శ్రీను, సింది, రెడ్డి, సూర్యనారాయణ, కార్యకర్తలు అభిమానుల పాల్గొన్నారు

నేడు జగనన్న సురక్షకు మంత్రి అమర్

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని జి.భీమవరం, జె.తుని గ్రామాల్లో సోమవారం నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొంటారని ఎంపిపి కలగా లక్ష్మి తెలిపారు.కార్యక్రమంలో మండల వైసిపినాయకులు, సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వంగవీటి మోహనరంగాకు నివాళి

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని తాళ్లపాలెం రామాలయం ఆవరణలో ఆదివారం వంగవీటి మోహనరంగా జయంతిని పురస్కరించుకుని రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.కశింకోట కాప్స్ రాక్స్ కెవిఆర్ సేవా సమితి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 50 మంది రక్తదానం చేసారు. రక్తదాతలను సన్మానించి, సర్టిఫికెట్ అందచేసారు. ఈ సందర్భంగా రంగా సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

రాయితీపై వరి విత్తనాల పంపిణీ



వరివిత్తనాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ నాని

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : మండలంలోని రాజాం రైతు భరోసా కేంద్రంలో వరివిత్తనాలను ఆదివారం స్థానిక సర్పంచ్ మరిసా నాని రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన వరి విత్తనాలను సబ్సిడీ ద్వారా ప్రభుత్వం అందజేస్తుందన్నారు. అదేవిధంగా వ్యవసాయ పనిముట్లు సబ్సిడీ ద్వారా ప్రభుత్వం అందజేస్తుందని, . ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిఇఒ సంతోష్, రైతులు పాల్గొన్నారు.

కొండెక్కిన కూరగాయల ధరలు

ప్రజాశక్తి -సీలేరు : సీలేరు వారపుసంతలో కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. టమోటా రేటు సెంచరీ దాటేసి, రూ.120 పలికింది. దీంతో సంతకు కూరగాయలు కొనేందుకు వచ్చిన వినియోగదారులు సగం సంచులతోనే ఇంటికి వెళ్లడం కనిపించింది. గత వారం వారపు సంతలో కిలో రూ.60లకు అమ్ముడుపోయిన టమోటా, ఈవారం ఏకంగా రెట్టింపైంది. కిలో టమోటా రూ.120 చెప్పడంతో మామూలు జనం అటువైపు చూడడం మానేశారు. ఇక పచ్చిమిర్చి రేటు ఒక్కసారిగా ఘాటెక్కింది . కిలో మిరపకాయలు రూ.200లకు విక్రయించారు. ఇక బెండకాయలు రూ.60, బీరకాయలు రూ.80, బీట్‌రూట్ రూ.80, క్యారెట్ రూ.80 ఇలా అన్ని కూరగాయల ధరలు భారీగానే పెరిగాయి.

సమస్యల నడుమ బస్‌స్టేషన్

-మూలకు చేరిన ఆర్‌ఓ ప్లాంట్ -ప్రయాణికులు కూర్చొనేందుకు కానరాని బెంచీలు

ప్రజాశక్తి-గొలుగొండ:ఇటు మైదానం..అటు ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన సుమారు 100 గ్రామాల ప్రజల రాకపోకలు సాగించే గొలుగొండ మండలం కృష్ణదేవిపేట ఆర్టీసీ బస్‌స్టేషన్ సమస్యల వలయంలో ఉంది. కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఏజెన్సీ ముఖద్వారంగా ఉండే ఈ గ్రామంలో బస్‌స్టేషన్ నిత్యం ప్రయాణికులతో సందడిగా ఉంటుంది. అయినప్పటికీ అభివృద్ధికి అధికారులు చర్యలు చేపట్టలేదు. ప్రధానంగా ఈ బస్‌స్టేషన్ ఆవరణ అధ్వాన్నంగా మారింది. ఎక్కడికక్కడ గోతులు పడటంతో పాటు రాళ్లు తేలుతుండటంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వర్షాకాలంలో ఆయా గోతుల్లో నీరు చేరుతుండటంతో మరింతగా ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.ఒక్కో సందర్భాల్లో గోతుల్లో నీరు బస్సులు వచ్చి వెళ్లేటప్పుడు ప్రయాణికులపై తుళ్లిన సంఘటనలు కూడా ఉన్నాయి.



నిరుపయోగంగా ఉన్న ఆర్‌ఓ ప్లాంట్



గోతులమయంగా ఉన్న బస్ స్టేషన్ ప్రాంగణం

ఇదిలా ఉండగా ఇక్కడ తాగునీటి సౌకర్యం కరువైంది. మూడున్నరేళ్ల క్రితం అల్లూరి సీతారామరాజు వర్తక సంఘం సభ్యులకు రూ.30వేలు వెచ్చించి ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. దీంతో, రెండేళ్ల పాటు ప్రయాణికులకు స్వచ్ఛమైన శుద్ధి నీరు అందేది. కొన్ని నెలల క్రితం అది పాడవడంతో మూలకు చేరింది. ఫలితంతా దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు దాహార్తి తీర్చుకునేందుకు షాపుల్లో వాటర్ ప్యాకెట్లు, బాటిళ్లను కొనుక్కొని తాగాల్సి వస్తోంది. ప్రయాణికులు కూర్చొనేందుకు అవసరమైన బెంచీలు కరువయ్యాయి. ఉన్న కొద్దిపాటివి చాలడం లేదని అంటున్నారు. ఈ బస్‌స్టేషన్‌లో ఫ్యాన్లు సైతం లేకపోవడం విశేషం. ఇటీవల ఒక ఫ్యాన్‌ను బిగించినప్పటికీ మూలకు చేరడం మరో విశేషం. అదే విధంగా ప్రయాణికులకు బస్సుల సమాచారం తెలిపే చార్టులు ఇక్కడ ఏర్పాటు చేయలేదు. ఎక్కువగా గిరిజన ప్రాంతాల నుంచి నిరక్షరాస్యులు ఈ బస్‌స్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. వారికి బస్సులు ఎప్పుడు, ఎక్కడికి వెళ్లేది సరైన సమాచారం అందటం లేదు.ఈ సమస్యలన్నింటిపై ఉన్నతాధికారులు తక్షణమే దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

న్యాయం జరిగే వరకూ పోరాటం

ప్రజాశక్తి -నక్కపల్లి: హెటిరో ఫైప్‌లైన్‌కు వ్యతిరేకం గా తలపెట్టిన శాంతియుత మహా ధర్నా న్యాయం జరిగే వరకూ కొనసాగిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు ,మత్స్యకారులు స్పష్టం చేశారు. పైపులైనుకు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన ధర్నా ఆదివారం 572వ రోజుకు చేరింది. ఆందోళన శిబిరం వద్ద పైపులైనుకు వ్యతిరేకంగా మత్స్యకారులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ,పైపులైనుకు వ్యతిరేకంగా మత్స్యకారులు 572 రోజుల నుండి ఆందోళన చేస్తుంటే నేటి వరకు సమస్య పరిష్కారానికి మార్గం చెప్పకపోవడం దారుణమన్నారు. మత్స్యకారుల జీవన విధానాన్ని దృష్టిలో పెట్టుకుని ఎట్టి పరిస్థితుల్లోనూ కొత్త పైపులైన్ ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులు ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు వాసుపల్లి నూకరాజు, గోసల సోమేశ్వరరావు, చేపల సోమేష్, పిక్కి రమణ, కోడా కాశీ, పిక్కి కోటి, అర్జిల్లి తాతాజీ, కారే భూలోక, కొత్వాల్ కాశీ తదితరులు పాల్గొన్నారు.

బోర్లు బాగు చేయరూ..

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలోని ఎండపల్లి గ్రామంలో గడిచిన పక్షం రోజులుగా తాగునీటి బోరు మరమ్మత్తు గురైనా పట్టించుకోక పోవడంతో స్థానికులు తాగు నీటికి ఇబ్బందులు పడుతు న్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా నూకాలమ్మ అమ్మవారి గుడి వద్ద బోరు కూడా మరమ్మత్తుకు గురైందని దానిని పట్టించుకోలేదని, తక్షణమే మండల స్థాయి అధికారులు స్పందించి బోర్లు మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



మరమ్మతుకు గురైన బోరు

శరవేగంగా పుష్కరిణి అభివృద్ధి పనులు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాకలో బంధర సరస్సు (పుష్కరిణి) అభివృద్ధి పనులు టీటీడీ ఆధ్వర్యంలో శరవేగంగా జరుగుతున్నాయి. గత కొన్ని సంవత్సరాల నుండి పుష్కరిణి నాచు మొక్కలు, గడ్డి, చెత్తతో నిండుకుని, కలుషితమైన నీరుతో చాలా అధ్వానంగా మారింది. సుదూర ప్రాంతాల నుండి వెంకన్నను దర్శించుకునేందుకు వచ్చే భక్తులు పుష్కరిణిలో స్నానం ఆచరించి స్వామిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. పుష్కరిణి అధ్వానంగా ఉండడంతో కాలు పెట్టలేని పరిస్థితి నెలకొంది. ప్రజాశక్తి దినపత్రికలో కూడా అధ్వానంగా పుష్కరిణి పేరిట కథనం ప్రచురణమైంది.ఇటీవల ఆలయ దర్శనానికి వచ్చిన టీటీడీ దేవస్థానం ఛైర్మన్ సుబ్బారెడ్డికి స్థానికులు పుష్కరిణి సమస్యను తీసుకువెళ్లారు.దీంతో ఆయన స్పందించి వెంటనే అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో గత పది రోజుల నుండి పుష్కరిణిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే పుష్కరిణిలో ఉన్న కలుషితమైన నీటిని మోటార్ల ద్వారా బయటకు తొలగించారు. పేరుకు పోయిన బురద వ్యర్థాలను ట్రాక్టర్ల ద్వారా బయటకు తరలిస్తున్నారు.



ప్రొక్లయినర్‌తో చేపడుతున్న పనులు



నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

తగ్గని ఎండలు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో ఎండల తీవ్రతతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఉదయం 9 గంటలకే భానుడు తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తున్నాడు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నారు. ఎండ తీవ్రత దాదాపు 39 డిగ్రీల వరకు నమోదు అవుతుండడంతో జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఎక్కడా చినుకు జాడ కనిపించక పోవడంతో రైతన్నలు ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. బోరు బావి ఉన్న చోట్ల రైతులు వరి నారుమడులు సిద్ధం చేసుకున్నారు.



పరిశీలిస్తున్న ఎంపిడిఒ

ఇంటింటా సర్వే చేపట్టాలి

ప్రజాశక్తి- నక్కపల్లి:జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి పక్కాగా సర్వే చేపట్టాలని ఎంపీడీవో సీతారామరాజు ఆదేశించారు. .మండలంలోని ఆదివారం దేవవరం, గొడిచెర్ల గ్రామాల్లోని సచివాలయాలను సందర్శించారు. జగనన్న సురక్షపై సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో సమీక్షించారు. సర్వే, టోకెన్స్, సర్వీసెస్ వర్క్ పై రివ్యూ నిర్వహించారు. అనంతరం ఉద్దండపురం సచివాలయాన్ని సందర్శించారు. సోమవారం గ్రామంలో జరగనున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు అందించాల్సిన ధ్రువీకరణ పత్రాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

190 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి -గొలుగొండ : మండలంలో లింగంపేట గ్రామంలో కాకినాడ "అంజు కంటి ఆసుపత్రి" ఆధ్వర్యాన్ని నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో కంటి వైద్యులు సుమారు 190మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 31మందిని ఆపరేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మేనేజర్ స్వామి, సర్పంచ్ సంతోష్ కుమార్, ఎంపిటిసి గొంతిన మహాలక్ష్మి, వైఎస్ఆర్‌సిపి గ్రామ కమిటీ నాయకులు పాసింబిల్లి మంగరాజు, మాజీ మండల యూత్ అధ్యక్షులు పరవాడ కవిలేశ్వరరావు, గొంతిన ప్రసాద్, సలాదుల నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



పరీక్షిస్తున్న వైద్యులు

మాలమహానాడు జిల్లా అధ్యక్షునిగా విజయబాబు

ప్రజాశక్తి పాయకరావుపేట:రాంబిల్లి మండలం కొత్తూరులోని జె.సిఆర్ లా ఛాంబర్ వద్ద మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అధ్యక్షులు జె.సి. రామకృష్ణ అధ్యక్షతన ఆదివారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. మాలమహానాడు జిల్లా శాఖ అధ్యక్షులుగా పాయకరావుపేట పట్టణంకు చెందిన గారా విజయబాబును ఎన్నుకున్నారు. పాయకరావుపేట లోని పరివర్తన నిలయంలో అభినందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాలల హక్కుల కోసం పోరాటం చేస్తున్న పార్టీలకు తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్డమూరి కృష్ణ స్వరూప్ విజయబాబును సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా ఇంచార్జ్ చిట్టిమూరి గోవిందు, నాయకులు మూర్తి, సంహాచలం తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న నేతలు



కారు స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

అల్లూరి స్మారక మందిరం సందర్శన

ప్రజాశక్తి-గొలుగొండ: అనకాపల్లి జిల్లా క్షత్రియ పరిషత్ సభ్యులు కృష్ణ దేవి పేటలో అల్లూరి స్మారక్ మందిరంను సందర్శించారు. ఈనెల 4న అల్లూరి సీతారామరాజు 125వ జయంతి ఉత్సవంలో భాగంగా 500 కార్లతో ర్యాలీ నిర్వహించుటకు నిర్ణయించారు. ఈ మేరకు కారు స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కర్ నాయుడు, నర్సీపట్నం క్షత్రియ పరిషత్తు అధ్యక్షులు మంతెన శ్రీరామ రాజు, పాకలపాటి రవిరాజు, రామరాజు, అరవింద రాజు, నాగరాజు, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.



చెత్తా చెదారం తొలగిస్తున్న యువకులు

యువకుల శ్రమదానం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలో ధర్మవరం అగ్రహారం గ్రామ సచివాలయం వద్ద పేరుకు పోయిన తుప్పలు, డొంకలను ఆ గ్రామ యువకులు శ్రమదానం చేసి శుభ్ర పరిచారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు. వైసిపి నాయకులు కర్రి శీను బాబు, మాజీ వార్డు మెంబర్ కోసూరు సత్యనారాయణ, 1వ వార్డు నెంబర్ నీలం రమణ, మాడా రమణ, చందక ఈశ్వరరావు, గజివెల్లి సంజీవరావు, నగిరెడ్డి నాగు, గజివెల్లి గణేష్ పోలిశెట్టి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

తాగునీటి బోర్లు ఏర్పాటు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో కశిమి పంచాయతీ శివారు గిరిజన గ్రామాలైన వడపర్తి, కశిమి గ్రామాల్లో ఆదివారం తాగునీటి బోర్లను ఏర్పాటు చేశారు. ఇటీవల నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఈ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సమయంలో గిరిజనలు తాగునీటి బోర్లు కావాలని కోరారు. వెంటనే జడ్పిటిసి సుర్ల వెంకటగిరి బాబు నిధులతో బోర్లను మంజూరు చేశారు. నిధులు మంజూరు కావడంతో బోర్లను ఆ గ్రామాల్లో ఆదివారం సర్పంచ్ స్వరూపారాణి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. దీంతో గిరిజన ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు లక్ష్మణరావు, జోగులమ్మ పాల్గొన్నారు.

అంబులెన్స్ సిబ్బందికి ఆటల పోటీలు

ప్రజాశక్తి-హుకుంపేట:అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సంస్థ మూడవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలో ఆదివారం 108,104,102 అంబులెన్స్ పైలెట్లు, టెక్నీషియన్స్, డేటా ఆపరేటర్లకు క్రికెట్, షటిల్ కాక్, చైర్ ఆటలను నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విజేతలకు అరబిందో కంపెనీ ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు.

పేదలకు పట్టాలిచ్చినా ఫలితం ఏదీ?

- సాగు భూములను ఆన్‌లైన్ చేయాలి - సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి-మాడుగుల:పేద ప్రజలకు పట్టాలిచ్చినా ఫలితం లేకుండా పోయిందని, ఈ విషయం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం తగదని సిపిఎం జిల్లా కార్యదర్శి కె లోకనాథం ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని ఒమ్మలి పంచాయతీ పరిధి వుర్లలోవ ప్రాంతాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి వెంకన్న, కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావుతో కలిసి పరిశీలించారు. అనంతరం పట్టా దారులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ, సంవత్సరాల తరబడి పట్టా భూములలో సాగు చేసుకుంటూ బతుకుతున్న పేదలను పాలకులు మోసం చేశారని విమర్శించారు. ఒమ్మలి గ్రామానికి చెందిన 150 మంది దళితులు, ఇతర పేదలకు 2013లో వుర్లలోవ రెవెన్యూ పరిధిలో 200 ఎకరాల డి ఫారం పట్టాలు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. వెబ్ లాండ్ రికార్డులో రెవెన్యూ విలేజ్‌గా నమోదు కాక పోవడంతో అన్ సెటిల్ విలేజ్‌గా ఉండిపోయిందని, దీంతో, పట్టాలు పంపిణీ చేసినా ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. అనేక సంవత్సరాలుగా జీడి మామిడి సాగు చేస్తున్న పేద, దళిత రైతులకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, వీరికి మాత్రం అందలేదని పేర్కొన్నారు.సంక్షేమ పథకాలు అమలు అందాలంటే వెబ్ లాండ్‌లో నమోదు కావాలని, ఊర్లోవ భూము అన్ లైన్ కాక వీరికి ఏ పథకం కూడా వర్తించలేదని పేర్కొన్నారు. ఇదే పరిస్థితి ఇతర ధనిక రైతులకు జరిగితే ప్రభుత్వం ఇలా నిర్లక్ష్యం చేస్తుందా అని ప్రశ్నించారు. ఈ విషయమై జాయింట్ కలెక్టర్ స్వయంగా దర్యాప్తు చేసి సదరు పట్టాలు ఆన్ లైన్ చేసి, అన్ని ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అమలు అయ్యేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరిట ఏజన్సీ ప్రాంతాల్లో మైనింగ్ కంపెనీలకు ప్రభుత్వం లీజుకు ఇస్తుండటంతో పేదల పట్టా భూములకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. మైనింగ్ వ్యాపారులు గిరిజన, దళిత రైతులపై దౌర్జన్యాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేత భవాని, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ఈదురు గాలుల బీభత్సం

-నేల కొరిగిన విద్యుత్ స్తంభాలు - పిడుగుపాటుకు యువకులకు గాయాలు



నేల కొరిగిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి-చీడికాడ:విపరీతమైన ఈదురుగాలుల తో కురిసిన వర్షానికి విద్యుత్ స్తంభాలు పెద్ద పెద్ద చెట్లు నేల కొరిగాయి. మండలం కేంద్రంలో ఆదివారం సుమారు నాలుగు గంటల సమయంలో విపరీతమైన ఈదురు గాలులతో కురిసిన వర్షానికి విద్యుత్ స్తంభాలతో పాటు పెద్ద పెద్ద చెట్లు నేల కొరిగాయి. ఆదివారం కురిసిన వర్షంతో రైతులకు వరి విత్తనాలు వేసుకునేందుకు అదును బాగుంటుందని రైతులు తెలిపారు.ఈ వర్షానికి విపరీతమైన ఈదురుగాళ్లు తోడవడంతో గ్రామంలో స్తంభాలతో పాటు టేకు, చింత, మామిడి, జీడి చెట్లు కూడా నేలకొరిగాయి.

చీడికాడ:వర్షం నీరు బయటికి పోవడానికి దారి లేక స్థానికులు పలు ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రంలో రాజావీధి వెనుక గుల్లిపెల్లిలో ఇళ్ల మధ్య వర్షం చేరింది. ఈ నీరు బయటికి వెళ్లడానికి దారి లేక పక్క వీధిలో డ్రైనేజీ, చెత్త, వ్యర్థాలతో కాలువలో అడ్డంగా కూరుకు పోయింది. ఈ నీరు పోవడానికి దారి లేక మురుగునీరు ఇళ్ల మధ్య నిలిచి ఉండటంతో ఇబ్బందులకు గురవుతున్నట్లు గుల్లేపల్లి కుటుంబీకులు నేతి ప్రసాదు, గుల్లిపెల్లి గోవిందులు తెలిపారు. రానున్న వర్షాకాలంలో నిత్యం వర్షాలతో మలేరియా, డెంగీ జ్వరాల బారిన పడే అవకాశం ఉందని గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు

పిడుగుపాటుకు యువకులకు గాయాలు

కొత్తకోట:రావికమతం మండలం చీమలపాడు శివారు గిరిజన గ్రామం తాటిపర్తిలో ఆదివారం సాయంత్రం వీచిన ఈదురు గాలులతో కూడిన వర్షంలో పిడుగు పడి పలువురు గిరిజన యువకులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. ఆదివారం సాయంత్రం తాటిపర్తి గ్రామ సమీపంలో పలువురు యువకులు వాలీబాల్ ఆడుతుండగా ఒక్కసారిగా గాలితో కూడిన వర్షం రావడంతో సమీపంలో గల చింత చెట్టు కిందకు పలువురు యువకులు చేరారు. అదే సమయంలో ఆ చెట్టు పైన పెద్ద శబ్దంతో పిడుగు పడటంతో చెట్టు కింద ఉన్న యువకులందరూ స్పృహ కోల్పోయారు. ప్రాణా పాయ స్థితి నుంచి స్వల్ప గాయలతో బయట పడ్డారు. ఇది గమనించిన చుట్టుపక్కల వారు 108కి సమాచారం అందించారు.

108 సిబ్బంది సహకారంతో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో గ్రామా నికి చెందిన సీదిరి శ్రీను, కుంద్ర బాలరాజు, .సోముల శ్రీను,) .పాడి చిన్నబ్బాయి, లోత కళ్యాణం, పాడి బాల కృష్ణ, సుర్ల గణేష్ తదితరులకు స్వల్ప గాయా లయ్యాయి. వీరిని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.



చికిత్స పొందుతున్న యువకుడు

సమస్యల నడుమ ఎస్‌సి కాలనీ

-తాగునీటి సమస్యతో సతమతం
-అస్తవ్యస్తంగా డ్రెయినేజీ



పని చేయని బోరు

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం మేజర్ పంచాయతీ కొత్తకోట ఎస్సీ కాలనీలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. కాలనీలో సుమారు మూడు వార్డులో మూడు వేలకు పైగా జనాభా ఉన్నారు. గత నాలుగు రోజులుగా తాగు నీరు అందక నానా అవస్థలు పడుతున్నారు. గ్రామీణ తాగు నీటి సరఫరా విభాగం అధికారులకు ముందస్తు ఆలోచనలు లేక పోవడంతో ఇంటింటి కుళాయిల పేరుతో గతంలో సరఫరా చేసిన పైపు లైన్ తొలగించారు. ప్రస్తుతం వేసిన ఇంటింటి కుళాయి ల పైపుల నుంచి నీరు సక్రమంగా రాక పోవడంతో తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ లో అపారిశుద్యం నెలకొంది. కాలవులు, రోడ్లపై చెత్త చెదారం తో నిండి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. రాజ్ విధి మార్గంలో (మెయిన్ రోడ్డులో) మినహా పారి శుధ్య పనులు చేపట్టిన దాఖలాలు లేవు. ఈ సమస్యలపై పంచాయతీ ఈఓ కృష్ణ మోహన్‌కు పలు మార్లు పిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు తెలిపారు. మరోవైపు ఇంటింటి కొళాయిలు ఏర్పాటు పేరుతో రోడ్లను ఇష్టానుసారంగా తవ్వడంతో రాళ్లు, మట్టి కాలువల్లో కూరుకు పోయింది. కాలవులు నిండి తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నాయి. పంచాయతీ పరిధిలోని వార్డులలో అధికారులు, పాలకులు తిరిగితే సమస్యలు తెలుస్తాయి. కనీసం వారానికి ఒక్కసారైనా వార్డుల్లో తిరిగి సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలన్నా తపన వార్డు పాలకుల్లో కనిపించ లేదని స్థానికులు విమర్శించారు.



డ్రెయినేజీలో నిలిచిన మురుగునీరు